
# జర్నలిస్ట్ డైరీ

తెలుగు దినపత్రిక



సంపుటి :13 సంచిక :12 బుధవారం 16-9-2026 పేజీలు:8 వెల:3 https://www.epaperjournalistdiary.com/

# భారత్‌దే సిరీస్

- రెండో టీ20లోనూ ఆప్ఘనిస్తాన్ చిత్తు
- విజృంభించిన నితీష్, అర్ష్‌దీప్
- సంజూ, అభిషేక్ మెరుపులు
- 7 వికెట్లతో టీమిండియా ఘన విజయం

02

ఆప్ఘనిస్తాన్‌పై టీమిండియా జోరు కొనసాగింది. రెండో టీ20లోనూ 7 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించి.. మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను మరో మ్యాచ్ మిగిలుండగానే 2-0తో కైవసం చేసుకుంది. నితీశ్ కుమార్ రెడ్డి, అర్ష్‌దీప్ సింగ్ బౌలింగ్‌లో మెరవగా.. సంజూ శాంసన్, అభిషేక్ శర్మ బ్యాట్‌తో చెలరేగారు. 160 పరుగుల లక్ష్యాన్ని భారత్ 14.5 ఓవర్లలోనే ఛేదించింది.



## నేడు 22ఎపై అసెంబ్లీలో
# కీలక చర్చ

- సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటనపై సర్వత్రా ఉత్కంఠ
- మంత్రులతో ముందుగానే ముఖ్యమంత్రి సమాలోచనలు
- 22ఎ భూముల సమస్యలపై అధికారులకు ఆదేశాలు?
- ప్రతిపక్ష విమర్శలకు సీఎం కౌంటర్ ఇచ్చే అవకాశం
- ధరణి లోపాలపై సభలో వివరించనున్న రేవంత్‌రెడ్డి
- బీఆర్ఎస్ హయాం భూదందాలపై ప్రస్తావన
- ధరణి ఫోరెన్సిక్ ఆడిట్ నివేదికపై స్పష్టత?
- 22ఎ చర్చ తర్వాత ఎల్‌నినోపై లఘు చర్చ

హైదరాబాద్

అసెంబ్లీ సమావేశాలు బుధవారం ఉదయం పది గంటలకు తిరిగి ప్రారంభం కానున్నాయి. సెక్షన్ 22ఏ అంశంపై చర్చ కొనసాగుతుందని అసెంబ్లీ కార్యదర్శి రేండ్ల తిరుపతి మంగళవారం తెలిపారు. 22ఏ అంశంపై మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి శనివారం చర్చను ప్రారంభించిన విషయం తెలిసిందే. మంగళవారం మధ్యాహ్నం హైదరాబాద్‌లోని ఎంసీఆర్‌హెచ్చార్డీలో మంత్రులతో సీఎం రేవంత్‌రెడ్డి సమావేశమయ్యారు. 22ఏ అంశం, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు,

-మిగతా 2 లో

## 2029 నాటికి 'అర్హులందరికీ'
# 'సొంతిల్లు'

### గృహ నిర్మాణ శాఖపై సీఎం చంద్రబాబు సమీక్ష

- 2027 మార్చి నాటికి 5.52 లక్షల గృహాలు పూర్తి చేయాలని సీఎం ఆదేశం
- ఉచిత ఇళ్ల స్థలాల కోసం పారదర్శక విధానం అమలు చేయాలని సూచన
- కేంద్ర సహకారంతో రాష్ట్రంలో పారిశ్రామిక టౌన్‌షిప్‌ల ఏర్పాటుకు ప్రణాళిక
- కుప్పం నియోజకవర్గంలో సంతృప్త స్థాయిలో ఇళ్ల నిర్మాణం చేపట్టాలని నిర్దేశం

ఏపీ బ్యూరో,

రాష్ట్రంలో అర్హులైన ప్రతి పేద కుటుంబానికి 2029 నాటికి సురక్షితమైన, శాశ్వతమైన గృహాన్ని అందించడమే లక్ష్యమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. 'హౌసింగ్ ఫర్ ఆల్' కార్యక్రమాన్ని సాచురేషన్ విధానంలో అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. ఇందులో భాగంగా 2027 మార్చి నాటికి 5.52 లక్షల ఇళ్లను పూర్తి చేయాలని గడువు నిర్దేశించారు. మంగళవారం తన క్యాంపు కార్యాలయంలో గృహ నిర్మాణ శాఖపై ఆయన ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథితో పాటు ఆ శాఖ, ఆర్థిక శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

-మిగతా 2 లో





# లోక్‌సభ ఎన్నికలకు సిద్ధమవుతున్న కాంగ్రెస్

- ఇప్పటి నుంచే పునాదులు వేస్తున్న హస్తం పార్టీ
- పార్టీ సీనియర్ల పనితీరును సమీక్షిస్తున్న అధిష్ఠానం
- సంస్థాగత పునర్వ్యవస్థీకరణపై దృష్టి సారింపు
- ప్రియాంక గాంధీకి కీలక పాత్ర అప్పగించే అవకాశం
- ద్వంద్వ నమూనాతో కాంగ్రెస్ పార్టీ ముందుకు
- విద్యార్థులతో మమేకమవడం ఈ వ్యూహంలో భాగమే
- జెన్ జెడ్, ఆల్ఫాలను ఆకట్టుకునేందుకు ప్రణాళికలు

న్యూఢిల్లీ:

2029 లోక్‌సభ ఎన్నికలను లక్ష్యంగా చేసుకుని కాంగ్రెస్ పార్టీ ఇప్పటి నుంచే సంస్థాగత పునర్వ్యవస్థీకరణ, ప్రజా చేరువ కార్యక్రమాలపై దృష్టి సారిస్తోంది. పార్టీ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రా కలిసి సీనియర్ నేతల పనితీరును సమీక్షిస్తున్నట్లు సమాచారం. ఇటీవల 130 మంది సీనియర్ నేతలను ఇద్దరూ పరిశీలించినట్లు నివేదికలు వెల్లడించాయి. పార్టీకి ప్రజల్లో మరింత చేరువ కావడం, ముఖ్యంగా యువత, మహిళలు, సామాజిక న్యాయం వంటి అంశాలపై విస్తృత ప్రచారం నిర్వహించడం రాహుల్ గాంధీ ప్రధాన బాధ్యతగా

-మిగతా 2 లో

## మసూద్ అజర్‌పై
# పాక్ నజరానా పెంపు

- ఆచూకీ తెలిపితే రూ.24 లక్షల బహుమతి
- 2021లో అఫ్ఘాన్‌కు పారిపోయినట్లు వెల్లడి
- కొత్త రెడ్‌బుక్‌లో అజర్ పేరు
- ఎఫ్ఏటీఎఫ్ భేటీ వేళ పాక్ చర్య
- పాక్ ప్రకటనలపై భారత్ విమర్శలు
- గతంలో గ్రే లిస్ట్‌లో పాకిస్థాన్
- ఉగ్ర నిధులపై చర్యలకు ఒత్తిడి
- పఠాన్‌కోట్, పుల్వామా దాడుల్లో నిందితుడు

02



# యూపీఐ లావాదేవీలపై ఛార్జీలు..

- రూ.2,000 దాటితే 0.4 శాతం ఎండీఆర్
- వినియోగదారులపై ఎలాంటి భారం లేదు
- అక్టోబర్ 15 నుంచి కొత్త ఛార్జీల అమలు
- వ్యాపారులే చెల్లించనున్న ఎండీఆర్
- రూ.75 వేల లావాదేవీపై గరిష్ఠంగా రూ.300
- 95 శాతం లావాదేవీలకు ఛార్జీల నుంచి మినహాయింపు
- చిరు వ్యాపారులు, వీధి వ్యాపారులకు ప్రత్యేక వెసులుబాటు
- నెలకు రూ.లక్ష దాటితే పెద్ద వ్యాపారులుగా గుర్తింపు




02

# ధ్వజారోహణంతో మొదలైన శ్రీవారి బ్రహ్మోత్సవాలు..

- పట్టువస్త్రాలు సమర్పించిన సీఎం చంద్రబాబు
- తిరుమలలో బ్రహ్మోత్సవాల శోభ
- ధ్వజస్తంభంపై గరుడ పటాన్ని ఎగురవేసిన వేదపండితులు
- కుటుంబ సభ్యులతో కలిసి విచ్చేసిన చంద్రబాబు
- రాష్ట్ర ప్రభుత్వం తరపున పట్టువస్త్రాలు సమర్పించిన సీఎం

06





## ఉద్యోగులకు 51 శాతం
# ఫిట్‌మెంట్ ఇవ్వాలి

- రేవంత్ హామీలను నమ్మితే ఉద్యోగులకు అన్యాయమే
- పీఆర్సీ గడువు ముగుస్తున్నా నిర్ణయం ఏదీ?
- వేతన సవరణ కోసం ఉద్యోగుల ఎదురుచూపులు
- పెరుగుతున్న జీవన వ్యయంతో ఆర్థిక ఇబ్బందులు
- ఉద్యోగుల సేవలను ప్రభుత్వం గుర్తించాలి
- పీఆర్సీపై ఉద్యోగ సంఘాలతో తక్షణమే చర్చలు
- హామీల అమలులో జాప్యంతో నమ్మకం కోల్పోయే ప్రమాదం
- ఆలస్యం చేస్తే ఉద్యమానికి సిద్ధం: తెలంగాణ రక్షణ సేన

హైదరాబాద్:

మాట తప్పడం, మడమ తిప్పడం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ట్రేడ్‌మార్క్‌గా మారిందని తెలంగాణ రక్షణ సేన విమర్శించింది. ముఖ్యమంత్రి ఇచ్చే హామీలను ఉద్యోగులు నమ్మితే చివరకు వారికి అన్యాయం తప్పదని ఆరోపించింది. ఉద్యోగుల పీఆర్సీ గడువు ముగిసే పరిస్థితి నెలకొన్న నేపథ్యంలో ప్రభుత్వం ఇకనైనా స్పందించి తక్షణమే 51 శాతం ఫిట్‌మెంట్ ప్రకటించాలని డిమాండ్ చేసింది. ప్రభుత్వ ఉద్యోగులు చాలాకాలంగా వేతన సవరణ కోసం ఎదురుచూస్తున్నారని తెలంగాణ రక్షణ సేన పేర్కొంది. ఉద్యోగుల సమస్యలను పరిష్కరిస్తామని ప్రభుత్వం హామీలు ఇస్తున్నప్పటికీ వాటిని

-మిగతా 2 లో



02

## అంతరిక్షంలో మా వద్ద
# ఆయుధాలున్నాయ్

- తొలిసారి అమెరికా బహిరంగ ప్రకటన..
- శత్రు దాడులను తిప్పికొట్టడమే లక్ష్యంగా మోహరింపు
- ఆయుధాల సంఖ్య, ఆచూకీపై గోప్యత కొనసాగింపు
- రక్షణతోపాటు దాడులు చేయగల సామర్థ్యం
- కైనెటిక్, నాన్-కైనెటిక్ వ్యవస్థలతో ప్రతిదాడి
- చైనా, రష్యాల కదలికలపై అమెరికా అప్రమత్తం
- భవిష్యత్ యుద్ధాల్లో ఉపగ్రహాలే కీలకమన్న అంచనా
- అంతరిక్ష ఆయుధాలపై అంతర్జాతీయ ఒప్పందాల ఆంక్షలు

## భూభారతి కాదు..
# భూహారతి

### రేవంత్ సర్కారు పథకం వెనుక కుంభకోణమే: కేటీఆర్

- ధరణితో భూములకు రక్షణ కవచం ఉండేది
- యజమాని వేలిముద్ర లేకుండానే లావాదేవీలపై ఆరోపణ
- భూయజమానులకు తెలియకుండానే నిషేధిత జాబితాలోకి
- ధరణి పోర్టల్‌ను వెంటనే పునరుద్ధరించాలని డిమాండ్
- అసైన్డ్ భూముల హక్కుల హామీని అమలు చేయాలి
- సస్పెన్షన్‌తో వెనక్కి తగ్గేది లేదు.. ప్రజల్లోనే ఉంటాం
- 22ఏ అక్రమాలు, కమీషన్లను బయటపెడతాం: కేటీఆర్

న్యూఢిల్లీ,

రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం తీసుకొచ్చే ప్రతి పథకం వెనుక ఒక కుంభకోణం ఉంటోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. గతంలో ధరణి పోర్టల్ భూములకు ఇనుప కంచెలా, రక్షణ కవచంలా పనిచేసేదని, ప్రస్తుతం భూ యజమానులకు తెలియకుండానే రిజిస్ట్రేషన్లు జరిగే పరిస్థితి ఏర్పడిందని విమర్శించారు. భూ యజమాని వేలిముద్ర లేకుండా భూ లావాదేవీలు జరిగే అవకాశం గతంలో ఉండేది కాదని కేటీఆర్ అన్నారు.

-మిగతా 2 లో




## నేడు 22ఎపై అసెంబ్లీలో కీలక చర్చ

(మొదటి తరువాయి)

ప్రతిపక్ష పార్టీలు వ్యవహరిస్తున్న తీరుపై చర్చ జరిగినట్టు తెలిసింది. 22ఏ నిషేధిత జాబితా వల్ల సామాన్య ప్రజలకు కలిగిన ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని వీలైనంత త్వరగా పరిష్కారం చూపాలని అధికారులకు ఆదేశాలు జారీ చేసే అవకాశమున్నది. ఉద్దేశపూర్వకంగానే ప్రజల భూములు, ఆస్తులను 22ఏ పరిధిలో చేర్చినట్టు ప్రతిపక్షాలు విమర్శిస్తున్నాయి. దీనిపై సీఎం రేవంత్‌రెడ్డి బుధవారం అసెంబ్లీలో స్పందించే అవకాశమున్నది. ప్రతిపక్షాలకు సమాధానం చెప్తారని తెలుస్తున్నది. సీఎం రేవంత్‌రెడ్డి ఏం మాట్లాడతారు, ఏం ప్రకటన చేస్తారనే దానిపై అందరిలోనూ ఉత్కంఠ నెలకొంది. 22ఏ వల్ల ఇబ్బందులు పడుతున్న ప్రజలకు ఏమైనా ఉపశమనం కలుగుతుందా?అన్నదాని కోసం ఎదురుచూస్తున్నారు. ఇంకోవైపు ధరణి పోర్టల్‌లో లోపాల వల్ల బీఆర్ఎస్ హయాంలో భారీగా భూదందాలు జరిగాయనే దానిపై సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో వివరించనున్నట్టు తెలిసింది. ముఖ్యంగా మాజీమంత్రి హరీశ్‌రావు, అతని మామ భూబదలాయింపులను ప్రోత్సహించిన అంశాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించనున్నట్టు సమాచారం. బీఆర్ఎస్ నేతల అక్రమ భూదందాలపై విచారణకు అదేశించే అవకాశం లేకపోలేదని తెలుస్తున్నది. ఇప్పటికే ధరణి అక్రమాలపై సెట్ దర్యాప్తునకు రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించిన విషయం తెలిసిందే. ధరణిపై ప్రభుత్వం ఫోరెన్సిక్ ఆడిట్‌ను నిర్వహించింది. ఆ నివేదికను ఇంకా బహిర్గతం చేయలేదు. దీనిపైనా సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టత ఇచ్చే అవకాశముందని తెలిసింది. దీంతో అందరి చూపు బుధవారం జరిగే అసెంబ్లీ సమావేశాలపైనే ఉంటుందనడంలో అతిశయోక్తి లేదు. 22ఏ అంశంపై చర్చ ముగిసిన అనంతరం ఎల్‌నినో ప్రభావంపై లఘు చర్చ ఉంటుందని అసెంబ్లీ కార్యదర్శి తిరుపతి తెలిపారు

## మసూద్ అజర్‌పై పాక్ నజరానా పెంపు

ఇస్లామాబాద్



జైషే మహ్మద్ చీఫ్ మసూద్ అజర్ ఆచూకీ తెలిపిన వారికి ఇచ్చే నజరానాను పాక్ ప్రభుత్వం రూ.24 లక్షలకు పెంచింది. అజర్ 2021లో అప్ఘనిస్థాన్‌కు పారిపోయాడని తన కొత్త రెడ్ బుక్‌లో పాక్ ఫెడరల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ తెలిపింది. ఫైనాన్షియల్ యాక్షన్ టాస్క్ ఫోర్స్(ఎఫ్ఏటీఎఫ్) అక్టోబర్‌లో సమావేశం కానున్న నేపథ్యంలో పాక్ ఈ చర్యలు తీసుకున్నది. పాక్ నజరానా పెంపుపై భారత్ స్పందిస్తూ.. ఇలాంటి మోసపు ప్రకటనలను ఆ దేశం గతంలో కూడా చేసిందని విమర్శించింది. గతంలో ఎఫ్ఏటీఎఫ్ పాకిస్థాన్‌ను గ్రే లిస్ట్‌లో ఉంచింది. ఉగ్రవాదానికి ఆర్థిక సాయంపై, మనీ లాండరింగ్‌పై చర్యలు తీసుకోవాలని ఆ సమయంలో పాక్‌పై ఒత్తిడి తెచ్చింది. మళ్లీ ఇప్పుడు అలాంటి ఒత్తిడి ఎదురయ్యే అవకాశం ఉన్న నేపథ్యంలో పాక్ అజర్‌పై ఉన్న నజరానాను పెంచింది. 2016 పఠాన్ కోట్, 2019లో పుల్వామా దాడుల్లో అజర్ నిందితుడిగా ఉన్నాడు.

## 2029 నాటికి 'అర్హులందరికీ' 'సొంతిల్లు'

(మొదటి తరువాయి)

**ఇళ్ల నిర్మాణ పనులను వచ్చే నెలలోగా గ్రౌండింగ్ చేయాలి**

ప్రధాన మంత్రి ఆవాస్ యోజన (గ్రామీణ్), పీఎం జన్ మన్ వంటి వివిధ పథకాల కింద చేపట్టాల్సిన ఇళ్ల నిర్మాణ పనులను వచ్చే నెలలోగా గ్రౌండింగ్ చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. పట్టణ ప్రాంతాల్లో 1.5 లక్షల ఇళ్ల నిర్మాణం చేపట్టాలని సూచించారు. డిసెంబరు 2026 నాటికి 2.05 లక్షల ఇళ్లు, 2027 మార్చి నాటికి మరో 2.74 లక్షల ఇళ్లను పూర్తి చేసి లబ్ధిదారుల గృహ ప్రవేశాలకు సిద్ధం చేయాలని ఆదేశించారు.

మొత్తం 18.72 లక్షల ఇళ్లు మంజూరు కాగా..ఇప్పటివరకు 13.20 లక్షలు పూర్తయ్యాయి

రాష్ట్రంలో పీఎంఏవై 1.0, 2.0, పీఎం జన్ మన్ పథకాల కింద మొత్తం 18.72 లక్షల ఇళ్లు మంజూరు కాగా, ఇప్పటివరకు 13.20 లక్షలు పూర్తయ్యాయని అధికారులు సీఎంకు వివరించారు. ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ పరిధిలో 16.11 లక్షల ఇళ్లకు గాను 11.31 లక్షలు, ఏపీ టిడ్కో పరిధిలో 2.61 లక్షల ఇళ్లకు గాను 1.88 లక్షల ఇళ్ల నిర్మాణం పూర్తయిందని తెలిపారు.

**ఉచిత ఇళ్ల స్థలాలపై ప్రత్యేక కార్యాచరణ**

ఇంటి స్థలం లేని అర్హులైన కుటుంబాలను కచ్చితంగా గుర్తించేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని సీఎం చంద్రబాబు సూచించారు. ఆవాస్ ప్లస్, హౌసింగ్, రెవెన్యూ శాఖలతో పాటు ఆర్టీజీఎస్ నుంచి డేటాను అనుసంధానం చేసి, డూప్లికేషన్ లేకుండా లబ్ధిదారులను గుర్తించాలన్నారు. గ్రామ, వార్డు సచివాలయాల స్థాయిలో ప్రాథమిక జాబితాలు ప్రచురించి, అభ్యంతరాలు స్వీకరించి, పారదర్శకంగా పరిష్కరించిన తర్వాతే తుది జాబితాలను ఖరారు చేయాలని స్పష్టం చేశారు. ఇప్పటికే ఉన్న లేఅవుట్లలో నిర్మాణాలు చేపట్టని భూమిని అవసరాన్ని బట్టి 2 లేదా 3 సెంట్ల ప్లాట్లుగా పునర్వ్యవస్థీకరించాలని నిర్దేశించారు. కుప్పం నియోజకవర్గంలో సాచురేషన్ విధానంలో గృహ నిర్మాణం చేపట్టాలని ప్రత్యేకంగా ఆదేశించారు.

**పారిశ్రామిక టౌన్‌షిప్‌ల ఏర్పాటుకు ప్రణాళిక**


రాష్ట్రంలో ఆర్థిక కార్యకలాపాలను పెంచే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వ సహకారంతో పారిశ్రామిక టౌన్‌షిప్‌లను నిర్మించే అంశంపై దృష్టి సారించాలని ముఖ్యమంత్రి గృహ నిర్మాణ శాఖను ఆదేశించారు. శ్రీసిటీ సహా ఇతర పారిశ్రామిక ప్రాంతాల్లో ఈ టౌన్‌షిప్‌ల ఏర్పాటు ద్వారా ఆర్థిక లావాదేవీలు పెరుగుతాయని అభిప్రాయపడ్డారు. ఇందుకోసం ఏపీ పారిశ్రామిక మౌలిక సదుపాయాల కల్పన సంస్థ (ఏపీఐఐసీ)తో సమన్వయం చేసుకుని ముందుకు సాగాలని సూచించారు.

**2027 డిసెంబరు నాటికి మరో 75 వేల కొత్త గృహాలు..**

2027 డిసెంబరు నాటికి మరో 75 వేల కొత్త గృహాలు మంజూరయ్యేలా, 1.5 లక్షల ఇళ్లను పైప్‌లైన్‌లో ఉంచేలా చూడాలని, ఇందుకు అవసరమైన నిధుల కోసం కేంద్ర గ్రామీణాభివృద్ధి, పట్టణాభివృద్ధి శాఖలతో సమన్వయం చేసుకోవాలని సీఎం స్పష్టం చేశారు

## కేంద్రం ఒత్తిడికి తలవంచిన మెటా

న్యూఢిల్లీ




భారత్‌లో పిల్లల ఆన్‌లైన్ భద్రతను మరింత బలోపేతం చేసే దిశగా సోషల్ మీడియా దిగ్గజం మెటా కీలక నిర్ణయం తీసుకుంది. తన ప్లాట్‌ఫామ్‌లపై గుర్తించే పిల్లల భద్రతకు సంబంధించిన కేసులు, ముఖ్యంగా బాలల లైంగిక వేధింపులు, దుర్వినియోగానికి సంబంధించిన ఘటనలను సంబంధిత దర్యాప్తు సంస్థలకు నివేదించేందుకు మెటా అంగీకరించింది. మెటా యాజమాన్యంలోని ప్లాట్‌ఫామ్‌లలో చిన్నారుల లైంగిక వేధింపులు, దోపిడీకి సంబంధించిన కంటెంట్, ప్రకటనలు వస్తున్నట్లు వార్తలు రావడంతో కేంద్రం, జాతీయ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ తీవ్రంగా స్పందించాయి. హానికరమైన కంటెంట్‌ను ముందుగానే గుర్తించి తొలగించడంతో పాటు, నేరాలకు సంబంధించిన సమాచారాన్ని చట్ట అమలు సంస్థలకు అందించాల్సిన బాధ్యతను కూడా ప్రభుత్వం నొక్కిచెబుతోంది. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వం డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లపై ఉక్కుపాదం మోపుతోంది. దాంతో మెటా ఇకపై పిల్లల భద్రతకు సంబంధించిన అంశాలను ఇండియన్ సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్ ఆధ్వర్యంలోని సైబర్ క్రైమ్ పోర్టల్‌కు నేరుగా నివేదించనుంది. ఇటీవల మెటా ప్రతినిధులు జాతీయ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ముందు హాజరయ్యారు. ఇన్‌స్టాగ్రామ్‌లో బాలల లైంగిక దోపిడీకి సంబంధించిన కంటెంట్‌పై వచ్చిన ఆరోపణల నేపథ్యంలో ఈ విచారణ జరిగింది. ఈ పరిణామాల మధ్య మెటా తాజాగా నిర్ణయం తీసుకోవడం ప్రాధాన్యత సంతరించుకుంది. పిల్లలకు సురక్షితమైన డిజిటల్ వాతావరణాన్ని కల్పించేందుకు ఇది ప్రారంభ అడుగు మాత్రమేనని ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి. ఇతర సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లు కూడా పిల్లల భద్రతకు సంబంధించి మరింత కఠినమైన చర్యలు తీసుకోవాలని కేంద్రం కోరుతోంది.

# భారత్‌దే సిరీస్

**-రెండో టీ20లోనూ ఆఫ్ఘనిస్తాన్ చిత్తు**
**- విజృంభించిన నితీష్, అర్ష్‌దీప్**
**- సంజూ, అభిషేక్ మెరుపులు**
**-7 వికెట్లతో టీమిండియా ఘన విజయం**




న్యూఢిల్లీ

ఆఫ్ఘనిస్తాన్‌తో జరుగుతున్న మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌ను భారత్ మరో మ్యాచ్ మిగిలుండగానే 2-0తో కైవసం చేసుకుంది. ఇప్పటికే తొలి మ్యాచ్‌లో సూపర్ విక్టరీ సాధించిన టీమిండియా.. మంగళవారం జరిగిన రెండో టీ20లోనూ అదే జోరు కొనసాగిస్తూ ఆఫ్ఘనిస్తాన్‌ను 7 వికెట్ల తేడాతో మట్టికరిపించింది. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన ఆఫ్ఘన్.. భారత బౌలర్లు నితీష్ కుమార్ రెడ్డి (3/24), అర్ష్‌దీప్ సింగ్ (2/35) ధాటికి నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 159 పరుగులు మాత్రమే చేసింది. ఆఫ్ఘనిస్తాన్ బ్యాటర్లలో కెప్టెన్ ఇబ్రహీం జద్రాన్ (37), రషీద్ ఖాన్ (28), రసూలీ (26) రాణించారు. అనంతరం 160 పరుగుల లక్ష్యాన్ని భారత్.. 14.5 ఓవర్లలో 3 వికెట్లు మాత్రమే కోల్పోయి ఛేదించింది. సంజూ శాంసన్ (57; 22 బంతుల్లో 7 ఫోర్లు, 4 సిక్సర్లు) హ్యాఫ్ సెంచరీతో చెలరేగాడు. ఇక రేపు (గురువారం) మధ్య నామమాత్రపు మూడో టీ20 జరగనుంది.

**ఓపెనర్ల విధ్వంసం..**

లక్ష్యఛేదనకు దిగిన టీమిండియాకు ఓపెనర్లు సంజూ శాంసన్, అభిషేక్ శర్మ విధ్వంసకర ఆరంభాన్ని అందించారు. తొలి బంతి నుంచే చెలరేగి ఆడిన వీరు ఆఫ్ఘన్ బౌలర్లపై విరుచుకుపడి తొలి వికెట్‌కు కేవలం 38 బంతుల్లోనే 88 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పారు. అనంతరం ధాటిగా ఆడుతున్న అభిషేక్ శర్మ (38; 19 బంతుల్లో 2 ఫోర్లు, 4 సిక్సర్లు) రషీద్ ఖాన్ బౌలింగ్‌లో వెనుతిరిగాడు. తర్వాత ధనాధన్ బ్యాటింగ్‌తో కేవలం 20 బంతుల్లోనే అర్ధ శతకం బాదేసిన శాంసన్ (57) కూడా చివరికి రషీద్ బౌలింగ్‌లోనే ఔటయ్యాడు. అనంతరం కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ (11) విఫలమైనా.. ఇషాన్ కిషన్ (38 నాటౌట్), తిలక్ వర్మ (15 నాటౌట్) చివరి వరకు అజేయంగా నిలిచి టీమిండియాను విజయతీరాలకు చేర్చారు. ఆఫ్ఘన్ బౌలర్లలో రషీద్ ఖాన్ 3 వికెట్లు పడగొట్టాడు.

**విజృంభించిన తెలుగుకుర్రాడు..**

అంతకుముందు టాస్ ఓడి తొలుత బ్యాటింగ్‌కు దిగిన ఆఫ్ఘనిస్తాన్‌కు భారత యువ పేస్ ఆల్‌రౌండర్, తెలుగుకుర్రాడు నితీష్ కుమార్ రెడ్డి నిప్పులు చెరిగే బంతులతో హడలెత్తించాడు. ఓపెనర్ గుర్బాజ్ (0)ను అర్ష్‌దీప్ డకౌట్ చేయడంతో ఆఫ్ఘన్ పరుగుల ఖాతా తెరవకుండానే తొలి వికెట్ కోల్పోయింది. తర్వాత మరో ఓపెనర్, కెప్టెన్ ఇబ్రహీం జద్రాన్.. సిదిఖుల్లా అటల్ (12)తో కలిసి రెండో వికెట్‌కు 51 పరుగులు జోడించాడు. ఈ దశలో బంతి అందుకున్న నితీష్ కళ్లు చెదిరే బంతితో కేలక ఇన్నింగ్స్ ఆడుతున్న ఇబ్రహీం (37)ను వెనక్కి పంపించాడు. తర్వాత గుల్బదీన్ నైబ్ (10)ను కూడా బౌల్డ్ చేసి ఆఫ్ఘనిస్తాన్‌కు మరో భారీ షాకిచ్చాడు. ఈ క్రమంలోనే సిదిఖుల్లాను రవి బిష్ణోయ్.. ప్రమాదకరమైన అజ్మతుల్లా ఒమర్‌జాయ్ (11)ను అక్షర్ పటేల్ ఇంటిబాట పట్టించారు. అనంతరం ధాటిగా ఆడుతున్న రసూలీ (26)ను అర్ష్‌దీప్ సింగ్ బౌల్డ్ చేయడంతో ఆఫ్ఘన్ 100 పరుగుల వద్ద 6 వికెట్లు కోల్పోయింది. అయితే, ఆఖరిలో ఆల్‌రౌండర్లు రషీద్ ఖాన్ (28), మొహమ్మద్ నబీ (20) రాణించడంతో ఆఫ్ఘనిస్తాన్ నిర్ణీత ఓవర్లలో 159/8 స్కోరు సాధించింది. భారత బౌలర్లలో నితీష్ కుమార్ రెడ్డి 3 వికెట్లతో విజృంభించగా.. అర్ష్‌దీప్ సింగ్ 2 వికెట్లతో సత్తా చాటాడు.

# లోక్‌సభ ఎన్నికలకు సిద్ధమవుతున్న కాంగ్రెస్

(మొదటి తరువాయి)

ఉండనున్నట్లు తెలుస్తోంది. యువతతో నేరుగా మమేకమయ్యే కార్యక్రమాలను కాంగ్రెస్ ఇప్పటికే ప్రారంభించింది. సెప్టెంబర్ 19న ఇండోర్‌లో రాహుల్ గాంధీ పాల్గొనే యువజన కార్యక్రమం కూడా ఈ వ్యూహంలో భాగం గా భావిస్తున్నారు. మరోవైపు పార్టీ సంస్థాగత వ్యవహారాలు, ఎన్నికల వ్యూహం, రాష్ట్రాల వారీగా పార్టీ బలోపేతంపై ప్రియాంకాగాంధీకి కీలకపాత్ర అప్పగించే అవకాశం ఉన్నట్లు కాంగ్రెస్ వర్గాల్లో చర్చ జరుగు తోంది. ఎన్నికల సమయంలో ప్రచారంతో పాటు కార్యకర్తలను సమన్వయం చేయడంలో ప్రియాంక కు ఇప్పటికే విస్తృత అనుభవం ఉంది. 2029లో రాహుల్ గాంధీని ప్రధాని అభ్యర్థిగా ముందుకు తీసుకెళ్లాలనే ఆలోచన కాంగ్రెస్‌లో బలపడుతోంది. రాబోయే అసెంబ్లీ ఎన్నికలను కూడా 2029 వ్యూహానికి ముందస్తు పరీక్షగా కాంగ్రెస్ భావిస్తోంది. రాహుల్, ప్రియాంక, మల్లికార్జున ఖర్గేలను విస్తృతంగా ప్రచారంలోకి దించేందుకు పార్టీ ప్రణాళికలు సిద్ధం చేస్తోంది.

**సంస్థాగత పునర్నిర్మాణానికి ప్రాధాన్యం**

ప్రాథమిక దశగా అఖిల భారత కాంగ్రెస్ కమిటీ (ఏఐసీసీ) కార్యదర్శుల నియామకంపై పార్టీ దృష్టి కేంద్రీకృతమై ఉంది. రాష్ట్రాలవ్యాప్తంగా క్షేత్రస్థాయి కార్యకలాపాలకు బాధ్యత వహించే 65కు పైగా కార్యదర్శి పదవుల కోసం కఠినమైన పరిశీలన జరుగుతోంది. చారిత్రాత్మకంగా బలహీనమైన సంస్థాగత నిర్మాణాలున్న ప్రాంతాలకు.. ముఖ్యంగా ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, ఒడిశా, మహారాష్ట్ర వంటి కీలక రాష్ట్రాలకు నాయకత్వం ప్రాధాన్యత ఇవ్వాలని నిర్ణయించారు. 2029లో వాస్తవిక విజయం సాధించాలంటే ఈ పోరాట క్షేత్రాలలో బలమైన ప్రదర్శన అత్యంత కీలకమని నాయకత్వం గుర్తిస్తోంది. యువ నాయకత్వ శ్రేణికి మార్గం సుగమం చేస్తూ, అభ్యర్థుల కార్యచరణ సామర్థ్యం, జెన్ జెడ్ ఓటర్లతో మమేకమయ్యే వారి ప్రతిభ ఆధారంగా వారిని మూల్యాంకనం చేస్తున్నారు.

**రాహుల్‌కు ప్రజా చేరువ.. ప్రియాంకకు సంస్థాగత వ్యూహం**

సంస్థాగత మార్పులకు అతీతంగా ప్రియాంక గాంధీ వాద్రాకు విస్తృతమైన, నిర్దిష్టమైన వ్యూహాత్మక పాత్రను అప్పగించనున్నట్లు ఇటీవలి పార్టీ చర్చలు సూచిస్తున్నాయి. ఆమె ప్రమేయాన్ని పెంచాలన్న దీర్ఘకాల అంతర్గత విజ్ఞప్తులకు స్పందిస్తూ, 2029 ఎన్నికల కోసం ఒక ఎన్నికల నిర్వహణ వ్యూహ బృందాన్ని ఏర్పాటు చేయాలని పార్టీ యోచిస్తోంది. దీనికి ప్రియాంక నాయకత్వం వహించనున్నట్లు సమాచారం. ఈ ప్రతిపాదిత కమిటీలో ముకుల్ వాస్నిక్, అశోక్ గెహ్లాట్ వంటి అనుభవజ్ఞులైన వ్యూహకర్తలతో పాటు కొత్త, యువతరం నాయకులు కూడా ఉంటారని భావిస్తున్నారు. రాహుల్ గాంధీ విద్యార్థులు, యువతను చేరుకోవడంపై ప్రధానంగా దృష్టి సారిస్తూ దేశవ్యాప్తంగా ప్రజా రక్షణగా కొనసాగుతుండగా.. ప్రియాంక గాంధీ వాద్రా బాధ్యతలు పార్టీ ప్రతిష్టను పెంచడం, ప్రచారాన్ని మెరుగుపరచడం, వ్యూహాలను అమలు చేయడంపై కేంద్రీకృతమై ఉంటాయి. 2024లో వాయనాడ్ నుంచి లోక్‌సభ స్థానాన్ని గెలుచుకుని, క్రియాశీల పార్లమెంట్ సభ్యురాలిగా పనిచేస్తున్నారు. ఆమె కీలకమైన పరిశీలన కమిటీలను, రాష్ట్ర ప్రచార పునర్వ్యవస్థీకరణలను నిర్వహించి పార్టీపై పట్టు సాధించారు. ఉదాహరణకు, అసెంబ్లీ ఎన్నికలకు ముందు అభ్యర్థుల జాబితాలను సిద్ధం చేయడం, స్థానిక పునర్వ్యవస్థీకరణలకు నాయకత్వం వహించడం వంటివి చేశారు. ఈ ముందస్తు సమీకరణ, 2029 ఒక నిజమైన సువర్ణావకాశాన్ని అందిస్తోందన్న కాంగ్రెస్ భావనను ప్రతిబింబిస్తోంది. కీలకమైన సీట్లను దక్కించుకోవడానికి పూర్తిగా ప్రాంతీయ సంకీర్ణ మిత్రపక్షాలపై ఆధారపడకుండా, పార్టీ తన స్వతంత్ర సంస్థాగత ఉనికిని బలోపేతం చేసుకోవాలన్న రాహుల్ గాంధీ అభిప్రాయం ఈ ప్రయత్నాలకు తోడై శక్తిగా ఉంది. గత ఎన్నికలలో ఓటర్ల స్పందనను ప్రభావితం చేసిన లోపాలను సరిదిద్దుకోవడం ద్వారా రాహుల్ బహిరంగంగా, ప్రియాంక వ్యూహాత్మకంగా తోడ్పడే ఉమ్మడి ద్వంద్వ నాయకత్వ నమూనా, అధికారంలో ఉన్న బీజేపీ ఎన్నికల అప్రతిహతాన్ని సవాలు చేయగల పటిష్టమైన పార్టీ నిర్మాణాన్ని నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకుంది.

## భూభారతి కాదు..భూహారతి

(మొదటి తరువాయి)

ప్రస్తుతం యజమానులకు సమాచారం లేకుండానే ఆస్తులు నిషేధిత జాబితాలో చేరుతున్నాయని ఆరోపించారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం తీసుకొచ్చిన 'భూభారతి' పేరే తప్ప, వాస్తవానికి అది 'భూహారతి'గా మారిందని ఆయన విమర్శించారు. అడ్డగోలు విధానాలను వెంటనే నిలిపివేసి ధరణి పోర్టల్‌ను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఎన్నికలకు ముందు ఎస్సీ, ఎస్టీల అసైన్డ్ భూములను క్రమబద్ధీకరించి యాజమాన్య హక్కులు కల్పిస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని కేటీఆర్ గుర్తుచేశారు. ఆ హామీని ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలని కోరారు. అసైన్డ్ భూములకు పట్టాలు ఇచ్చే పేరుతో ముందుగానే ఒప్పందాలు కుదుర్చుకుని వందల, వేల కోట్ల రూపాయలు దండుకునేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారనే అనుమానాలు ఉన్నాయని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తోందని కేటీఆర్ మండిపడ్డారు. ప్రధాన ప్రతిపక్షం చెప్పని మాటలను తమకు ఆపాదిస్తూ వక్రీకరణకు పాల్పడుతోందని విమర్శించారు. తమ పార్టీ నాయకుడి మరణాన్ని కోరుతూ కాంగ్రెస్ ఎమ్మెల్యేలు మాట్లాడారని, ముఖ్యమంత్రి ప్రోద్బలంతోనే ఇలాంటి పరిణామాలు చోటుచేసుకుంటున్నాయని ఆరోపించారు. దీనికి నిరసనగా తాము ఆందోళన చేపట్టామని, ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కు ప్రధాన ప్రతిపక్షానికి ఉందని స్పష్టం చేశారు. ప్రతిపక్షం లేవనెత్తుతున్న అంశాలకు సమాధానం చెప్పే సత్తా, సమర్థత ప్రభుత్వానికి లేకపోవడంతోనే తమను శాసనసభ నుంచి సస్పెండ్ చేస్తున్నారని కేటీఆర్ అన్నారు. సస్పెన్షన్‌తో తమకు ఎలాంటి ఇబ్బంది లేదని, ప్రతిరోజూ ప్రజల్లో ఉంటూ వారి సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకువస్తున్నామని చెప్పారు. ముఖ్యమంత్రి కుటుంబ సభ్యుల భూ వ్యవహారాలు, 22ఏ పేరుతో జరుగుతున్న అక్రమాలు, 30 శాతం కమీషన్లు, ప్రభుత్వ పెద్దల వ్యాఖ్యలను ప్రజల ముందు నిరంతరం బహిర్గతం చేస్తామని కేటీఆర్ తెలిపారు. బీఆర్ఎస్ తిరిగి అధికారంలోకి వచ్చిన తర్వాత అన్ని వ్యవహారాలను వెలుగులోకి తీసుకువచ్చి, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## ఉద్యోగులకు 51 శాతం ఫిట్‌మెంట్ ఇవ్వాలి

(మొదటి తరువాయి)

అమలు చేయడంలో మాత్రం జాప్యం చేస్తోందని విమర్శించింది. పీఆర్సీ గడువు ముగిసే దశకు చేరుకుంటున్నా ప్రభుత్వం స్పష్టమైన నిర్ణయం తీసుకోకపోవడం ఉద్యోగుల్లో ఆందోళనకు కారణమవుతోందని తెలిపింది. పెరుగుతున్న ధరలు, కుటుంబ అవసరాలు, జీవన వ్యయం నేపథ్యంలో ఉద్యోగులకు వేతన సవరణ ఎంతో అవసరమని పేర్కొంది. ప్రభుత్వం ఉద్యోగుల ఆర్థిక పరిస్థితిని పరిగణనలోకి తీసుకుని తక్షణమే పీఆర్సీపై నిర్ణయం తీసుకోవాలని కోరింది. ఉద్యోగులకు 51 శాతం ఫిట్‌మెంట్ ఇవ్వడం ద్వారా వారి వేతన సవరణకు న్యాయం చేయాలని డిమాండ్ చేసింది. ఉద్యోగులు ప్రభుత్వ పాలనలో కీలక పాత్ర పోషిస్తున్నారని, ప్రభుత్వ పథకాలు, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో వారి సేవలు ఎంతో ముఖ్యమని తెలంగాణ రక్షణ సేన తెలిపింది. అలాంటి ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించకుండా కాలయాపన చేయడం సరికాదని పేర్కొంది. పీఆర్సీ విషయంలో ప్రభుత్వం ఉద్యోగ సంఘాలతో చర్చించి స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలని సూచించింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గతంలో ఇచ్చిన హామీలను గుర్తుచేసుకుని వాటిని అమలు చేయాలని తెలంగాణ రక్షణ సేన కోరింది. హామీలను ప్రకటించి వాటి అమలులో వెనుకడుగు వేయడం వల్ల ఉద్యోగుల్లో ప్రభుత్వంపై నమ్మకం తగ్గే అవకాశం ఉందని పేర్కొంది. మాటలకే పరిమితం కాకుండా ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం కార్యాచరణ ప్రకటించాలని డిమాండ్ చేసింది. పీఆర్సీ గడువు ముగిసిన తర్వాత కూడా నిర్ణయం తీసుకోవడంలో జాప్యం జరిగితే ఉద్యోగులు ఆర్థికంగా నష్టపోయే పరిస్థితి ఏర్పడుతుందని తెలంగాణ రక్షణ సేన ఆందోళన వ్యక్తం చేసింది. అందువల్ల ఎలాంటి ఆలస్యం లేకుండా 51 శాతం ఫిట్‌మెంట్‌ను ప్రకటించి ఉద్యోగులకు న్యాయం చేయాలని కోరింది.


## యూపీఐ లావాదేవీలపై ఛార్జీలు..

(మొదటి తరువాయి)

యూపీఐ లావాదేవీలపై వసూలు చేసే ఛార్జీలపై కేంద్రం స్పష్టతనిచ్చింది. రూ.2,000 దాటిన యూపీఐ లావాదేవీలపై 0.4 శాతం ఛార్జీలు వసూలు చేయనున్నట్లు కేంద్రం ప్రకటించింది. ఎండీఆర్ (మర్చంట్ డిస్కౌంట్ రేట్)గా పిలిచే ఈ ఛార్జీలు వ్యాపారులు మాత్రమే చెల్లించాలి. వినియోగదారులు ఎలాంటి ఛార్జీలు చెల్లించాల్సిన అవసరం లేదు. ఈ అంశంపై ఎన్‌పీసీఐ (ద నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) కీలక వివరాల్ని వెల్లడించింది. దీని ప్రకారం వచ్చే అక్టోబర్ 15 నుంచి ఈ ఛార్జీలు అమలులోకి వస్తాయి. యూపీఐ నుంచి మర్చంట్స్‌కు చేసే చెల్లింపులపైనే ఈ ఎండీఆర్. అలాగే, యూపీఐ నుంచి బ్యాంకులకు, యూపీఐ అకౌంట్లకు చేసే చెల్లింపులు ఎప్పట్లాగే ఉచితం. నిబంధనల ప్రకారం అర్హులైన వ్యాపారులకే ఇది వర్తిస్తుంది. అలాగే, కొన్ని చిన్న వ్యాపారాలు, ప్రత్యేక, అత్యవసర సేవలకు ఈ విషయంలో మినహాయింపు ఉంటుంది. ఈ ఛార్జీలకు సంబంధించి వినియోగదారులకు ఎలాంటి భారం పడదు. రూ.2,000 దాటి చేసే యూపీఐ చెల్లింపులపై, ప్రతి లావాదేవీపై 0.4 శాతం ఎండీఆర్‌ను వ్యాపారులే చెల్లించాలి. గరిష్టంగా రూ.300 వరకే ఉంటుంది. సగటు ఛార్జీలు ఇలా ఉంటాయి. రూ.3,000 లావాదేవీపై రూ.12, రూ.50,000 లావాదేవీపై రూ.200, రూ.75,000 లావాదేవీపై రూ.300 డీపీఆర్ చెల్లించాలి. రూ.75,000 దాటినా సరే.. గరిష్టంగా ఒక లావాదేవీపై రూ.300 మాత్రమే ఛార్జీ ఉంటుంది. ఎన్‌పీసీఐ చెబుతున్న వివరాల ప్రకారం 95 శాతం యూపీఐ లావాదేవీలు రూ.2,000 కంటే తక్కువగానే ఉంటున్నాయి. అందువల్ల 5 శాతం లావాదేవీలపైనే ఈ ఛార్జీలు ఉంటాయి. వీధి వ్యాపారులు, చిరు వ్యాపారులకు ఈ విషయంలో పీ2పీఎం కింద మినహాయింపు ఉంటుంది. అలాగే, క్యూఆర్ కోడ్ ద్వారా నెలకు రూ.1 లక్ష లావాదేవీ దాటిన వాటిపైనే ఎండీఆర్ చార్జీలుంటాయి. అది రూ.లక్ష లావాదేవీ మూడు నెలలు వరుసగా దాటితే వారిని పెద్ద వ్యాపారులుగా పరిగణిస్తారు.

## అంతరిక్షంలో మా వద్ద ఆయుధాలున్నాయ్..

న్యూఢిల్లీ



అంతరిక్షం లో తమ వద్ద ఆయుధాలు ఉన్నాయని అమెరికా తొలిసారి బహిరంగంగా ప్రకటించింది. ఇప్పటికే కొన్ని 'స్పేస్ కంట్రోల్ వెపన్స్ కక్ష్యలో ఉన్నాయని అమెరికా స్పేస్ ఫోర్స్ వెల్లడించింది. శత్రు దేశాల దాడుల నుంచి అమెరికా, మిత్రదేశాల బలగాలను రక్షించేందుకే వీటిని మోహరించినట్లు తెలిపింది. అయితే ఆయుధాల సంఖ్య, వాటి స్థానం, ఏ తరహా వ్యవస్థలను ఉపయోగిస్తున్నారన్న వివరాలను మాత్రం బయటపెట్టలేదు. అమెరికా ఎయిర్‌ఫోర్స్ కార్యదర్శి ట్రాయ్ మెయింక్ కూడా ఈ విషయాన్ని ధ్రువీకరించారు. అమెరికా సాయుధ బలగాలపై శత్రు దేశాల నుంచి ఎదురయ్యే ముప్పులను ఎదుర్కొనే సామర్థ్యాలను మరింత పెంచుతున్నామని చెప్పారు. ప్రస్తుతం కక్ష్యలోనే శత్రు చర్యలను ఎదుర్కోగల అంతరిక్ష ఆయుధాలు ఉన్నాయని స్పష్టంచేశారు. ఈ ఆయుధాలు 'కైనెటిక్, నాన్-కైనెటిక్' విధానాల్లో పనిచేయగలవని స్పేస్ ఫోర్స్ తెలిపింది. అవసరాన్ని బట్టి రక్షణతోపాటు దాడి చర్యల్లోనూ వీటిని ఉపయోగించవచ్చని పేర్కొన్నది. అయితే అవి ఉపగ్రహాలను ధ్వంసం చేసే ఆయుధాలా, ఇతర రకాల వ్యవస్థలా అన్నదానిపై స్పష్టత ఇవ్వలేదు. అంతరిక్ష రంగంలో చైనా, రష్యాల నుంచి ముప్పు పెరుగుతోందని అమెరికా భావిస్తోంది. ఉపగ్రహాలు సైనిక కమ్యూనికేషన్లు, నిఘా, నావిగేషన్‌కు కీలకం కావడంతో వాటిపై ఆధిపత్యం భవిష్యత్ యుద్ధాల్లో కీలకంగా మారనుంది. ఈ నేపథ్యంలో అమెరికా తొలిసారి కక్ష్యలో ఆయుధాల ఉనికిని బహిరంగంగా అంగీకరించడం ప్రాధాన్యం సంతరించుకుంది. 1967 నాటి ఔటర్ స్పేస్ ట్రీటీ అంతరిక్షంలో సామూహిక విధ్వంసక ఆయుధాల మోహరింపును నిషేధిస్తుంది.

Journalist dairy
బుధవారం
16-09-2026
జర్నలిస్ట్ డైరీ
తెలుగు దినపత్రిక

# నిజాం రాజరికాన్ని కూలదోసిన వీరులు కమ్యూనిస్టులే

**-సీపీఐ జిల్లా కార్యదర్శి, జాతీయ సమితి సభ్యుడు పాలమాకుల జంగయ్య**

**-పదివేల గ్రామాలను విముక్తి చేసిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం**

**-తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట 78వ వార్షికోత్సవాల సందర్భంగా షాద్‌నగర్ లో సభ**




**రంగారెడ్డి జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 15 (జర్నలిస్ట్ డైరీ) :** నిజాం రాజరిక వ్యవస్థను, జాగీర్దారులు, రజాకారుల దురాగతాలను ఎదురించి తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటాన్ని ముందుండి నడిపి వేలాది గ్రామాలను విముక్తి చేసిన ఘనత కమ్యూనిస్టులదేనని సీపీఐ జిల్లా కార్యదర్శి, జాతీయ సమితి సభ్యుడు పాలమాకుల జంగయ్య అన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట 78వ వార్షికోత్సవాల సందర్భంగా మంగళవారం షాద్‌నగర్ పట్టణంలోని విశ్రాంత ఉద్యోగుల భవనంలో షాద్‌నగర్ నియోజకవర్గ కమిటీ ఆధ్వర్యంలో సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పాలమాకుల జంగయ్య మాట్లాడుతూ నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా ప్రజలను సమీకరించి, రాజరిక వ్యవస్థను కూలదోసేందుకు కమ్యూనిస్టులు సాయుధ పోరాటానికి నాయకత్వం వహించారని తెలిపారు.
రజాకారుల దుర్మార్గాలు, జాగీర్దారుల దోపిడీ, దౌర్జన్యాలను ఎదిరిస్తూ కమ్యూనిస్టులు ప్రజల పక్షాన నిలిచారని అన్నారు. ప్రజల విముక్తి కోసం పోరాడిన క్రమంలో సుమారు నాలుగు వేల మంది కమ్యూనిస్టు యోధులు ప్రాణత్యాగం చేశారని, వారి త్యాగాలు తెలంగాణ చరిత్రలో చిరస్మరణీయమని కొనియాడారు. నాటి తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా సాగిన ప్రజా పోరాటమని, దాని చరిత్రను వక్రీకరించే ప్రయత్నాలు జరుగుతున్నాయని జంగయ్య విమర్శించారు. సాయుధ పోరాటాన్ని కేవలం హిందూ-ముస్లిం పోరాటంగా చిత్రీకరించడం చారిత్రక వాస్తవాలను వక్రీకరించడమేనని అన్నారు. భూస్వామ్య, జాగీర్దారీ, నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా రైతులు, కూలీలు, పేద ప్రజలను సమీకరించి కమ్యూనిస్టులు పోరాటం సాగించారని తెలిపారు. నాటి తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట స్ఫూర్తితో రంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా కమ్యూనిస్టులు ప్రజల తరఫున నిలబడి పోరాడాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రజల సంక్షేమం, అభివృద్ధి, సామాజిక న్యాయం కోసం నిరంతరం ప్రజా ఉద్యమాలను బలోపేతం చేయాలని కార్యకర్తలకు సూచించారు. సెప్టెంబర్ 17న హైదరాబాద్‌లోని ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో నిర్వహించనున్న భారీ బహిరంగ సభకు షాద్‌నగర్ నియోజకవర్గం నుంచి పెద్ద సంఖ్యలో కార్యకర్తలు, ప్రజలు తరలిరావాలని జంగయ్య పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు, ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి పానుగంటి పర్వతాలు, సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు, బీకేఎంయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బుద్ధుల జంగయ్య, జిల్లా కార్యవర్గ సభ్యుడు, సర్పంచ్ ఎం. శ్రీను, సీనియర్ నాయకుడు టంగుటూరు నరసింహారెడ్డి తదితరులు కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు.కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి ఎం.డి. షకీల్, గోవింద నాయక్, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎం. పవన్, జిల్లా సహాయ కార్యదర్శి ఆకాష్, పార్టీ నాయకులు మహ్మద్ హుస్సేన్, ప్రసాద్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

## మట్టి వినాయకుల ను పూజిద్దాం.... పర్యావరణం ను పరిరక్షిద్దాం ..ఆరెకపూడి గాంధీ.



**రంగారెడ్డి జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 15 (జర్నలిస్ట్ డైరీ) :** వినాయక చవితి పర్వదినం సందర్భంగా పియేసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ ని వివేకానంద నగర్ లోని వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి వినాయక చవితి పర్వదినం శుభాకాంక్షలు తెలియచేసిన తాజా మాజీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్, నాయకులు,కార్యకర్తలు, అభిమానులుఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ శేరిలింగంపల్లి నియోజకవర్గం ప్రజలందరికీ వినాయక చవితి పర్వదినం శుభాకాంక్షలు తెలియచేస్తున్నాను అని, మీ జీవితంలోని సకల విఘ్నాలను తొలగించి, విజయాలను అందించాలని, సమస్త శుభాలు, సంతోషాలను ప్రసాదించే విఘ్నేశ్వరుడి అనుగ్రహం మీపై ,మీ కుటుంబ సభ్యుల పై ఎల్లప్పుడూ ఉండాలని మనసారా కోరుకుంటూ శ్రీ వినాయకుని ఆశీస్సులతో అందరి జీవితాల్లో సుఖసంతోషాలు,ఆయురారోగ్యాలు వెల్లివిరియాలని ఆకాంక్షిస్తూ వినాయక చవితి పర్వదినం శుభాకాంక్షలు తెలియచేస్తున్నాను అని, మన సంస్కృతి, సాంప్రదాయాలను కాపాడుకుంటూనే.. పర్యావరణాన్ని పరిరక్షించాలనే ఉన్నతమైన లక్ష్యంతో ప్రతి ఒక్కరు తప్పనిసరిగా మట్టి వినాయకులను పూజించాలని, భక్తితో పాటు ప్రకృతి పట్ల బాధ్యతను కలిగి ఉండడం మనందరి ధర్మం. ఈ వినాయక చవితికి ప్రతి ఒక్కరూ మట్టి విగ్రహాలనే పూజించి, పర్యావరణహితమైన పండుగను జరుపుకోవాలని తెలియచేశారు.ఈ కార్యక్రమంలో నాయకులు,కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# షాద్‌నగర్‌లో ప్రజాకళా జాతర కరపత్రం ఆవిష్కరణ

**-అరుణోదయ విమలక్క 50 ఏళ్ల విప్లవ ప్రజా సాంస్కృతిక ఉద్యమ ప్రస్థానం**

**-ప్రజా కళా ఉద్యమానికి ఘన సత్కారం**

**- సెప్టెంబర్ 26, 27, 28న హైదరాబాద్‌లో ప్రజా కళా జాతర**



**రంగారెడ్డి జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 15 (జర్నలిస్ట్ డైరీ) :** అరుణోదయ విమలక్క 50 ఏళ్ల విప్లవ ప్రజా సాంస్కృతిక ఉద్యమ ప్రస్థానాన్ని పురస్కరించుకుని సెప్టెంబర్ 26, 27, 28 తేదీల్లో హైదరాబాద్ బాగ్‌లింగంపల్లి ఆర్టీసీ కళ్యాణ మండపంలో నిర్వహించనున్న ప్రజా కళా జాతరను విజయవంతం చేయాలని పిలుపునిస్తూ షాద్‌నగర్ అమరవీరుల స్తూపం వద్ద కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విమలక్క మాట్లాడుతూ ప్రజా, విప్లవ ఉద్యమాలు తమ సహజ క్రమంలో ఎంతోమంది కళాకారులను సృష్టిస్తాయని, అయితే ఒకే ఆశయానికి జీవితాంతం అంకితమై ప్రజా కళా ఉద్యమానికి సేవ చేయడం అత్యంత అరుదైన విషయమని అన్నారు. చాకలి ఐలమ్మ, గద్దర్, పండుగ సాయన్న, సర్వాయి పాపన్న, కొండా లక్ష్మణ్ బాపూజీ, ఆచార్య జయశంకర్, ఆచార్య కేశవరావు జాదవ్, కొమరం భీమ్, సమ్మక్క-సారక్క, భాగ్యరెడ్డి వర్మ, అరిగె రామస్వామి తదితర మహనీయుల పోరాట స్ఫూర్తిని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రజా కళా జాతర ఒక వేదికగా నిలుస్తుందని పేర్కొన్నారు.మానవ హక్కుల వేదిక కార్యకర్త, సమాచార హక్కు రాష్ట్ర నాయకులు కె. జంగయ్య మాట్లాడుతూ ప్రజా కళాకారులు, సాంస్కృతిక యోధులు, ఆలోచనాపరులు, యువత, పౌర సమాజ ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొని మూడు రోజుల ప్రజా కళా జాతరను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఇది వ్యక్తి పూజ కోసం నిర్వహించే కార్యక్రమం కాదని, ప్రజల కోసం, ప్రజా ఉద్యమాల కోసం, ప్రజా కళా-సాంస్కృతిక విలువల కోసం జీవితాన్ని అంకితం చేసిన కళాకారిణి, ఉద్యమానికి ఇచ్చే గౌరవమని తెలిపారు.షాద్‌నగర్ ప్రాంతానికి చెందిన హక్కుల సంఘాల కార్యకర్తలు, ఆర్టీఐ కార్యకర్తలు, యువజనులు, వీధి వ్యాపారుల సంఘం ప్రతినిధులు కార్యక్రమంలో చురుగ్గా పాల్గొంటామని తెలిపారు. స్థానిక జానపద కళారూపాలు, ప్రజా గేయాలు, సామాజిక యోధుల జీవిత గాథలను ప్రజా కళా జాతర వేదికపై ప్రదర్శించేందుకు సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు.మహాత్మా జ్యోతిబా ఫూలే, సావిత్రిబాయి ఫూలే, ఫాతిమా షేక్, డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ వంటి సామాజిక విప్లవకారుల స్ఫూర్తితో పాటు ప్రజా ఉద్యమాల్లో భాగమైన సామాజిక యోధుల పోరాటాలను కళా రూపాల ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని వక్తలు అన్నారు. కుల, మత భేదాలకు అతీతంగా ప్రజలను చైతన్యపరిచే ప్రత్యామ్నాయ ప్రజా సంస్కృతిని నిర్మించడంలో కళాకారుల పాత్ర కీలకమని తెలిపారు.
మరుగున పడుతున్న జానపద కళారూపాలకు మళ్లీ జీవం పోయడం, ప్రజా కళాకారుల సమస్యలను వెలుగులోకి తీసుకురావడం, కళాకారుల సంక్షేమ నిధి కోసం ప్రజా ఉద్యమాన్ని నిర్మించడం వంటి అంశాలకు ప్రజా కళా జాతర వేదికగా నిలవాలని ఆకాంక్షించారు.ప్రజా కళా జాతర మనందరి జాతర అని, ఇది కేవలం ఒక వ్యక్తిని స్మరించుకునే కార్యక్రమం కాదని, ప్రజా కళకు గౌరవం ఇచ్చే వేదికగా, ప్రజా సంస్కృతిని కాపాడే ఉద్యమంగా, కళాకారుల హక్కుల కోసం గొంతెత్తే సందర్భంగా, సామాజిక చైతన్యం, సమానత్వం, ప్రజాస్వామ్య విలువలను బలోపేతం చేసే సాంస్కృతిక పండుగగా నిలుస్తుందని నిర్వాహకులు తెలిపారు.
షాద్‌నగర్ ప్రాంత ప్రజలు, కళాకారులు, యువత, మేధావులు, పౌర సమాజ ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొని సెప్టెంబర్ 26, 27, 28 తేదీల్లో హైదరాబాద్‌లో జరిగే ప్రజా కళా జాతరను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతు కూలి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పట్లోళ్ల నాగిరెడ్డి, లంబాడ హక్కుల పోరాట సమితి నాయకుడు పాండు నాయక్, ప్రజాసంఘాల ఉమ్మడి వేదిక నాయకుడు గిరి, మానవ హక్కుల వేదిక మరియు సమాచార హక్కు రాష్ట్ర నాయకులు కె. జంగయ్య, రహమద్దీన్, న్యాయవాది బసవరాజు, ఎం.డి. గౌస్, ఫారూఖ్, రవికుమార్, జ్యోతి, శీను నాయక్, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

## న్యూ శంకర్ నగర్ కాలనీ లో నూతనంగా నిర్మించిన కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ భవనంను ప్రారంభించిన గాంధీ.



**రంగారెడ్డి జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 15 (జర్నలిస్ట్ డైరీ) :** చందానగర్ డివిజన్ పరిధిలోని న్యూ శంకర్ నగర్ కాలనీ లో నూతనంగా నిర్మించిన కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ భవనంను తాజా మాజీ కార్పొరేటర్ మంజుల రఘునాథ్ రెడ్డి తో కలిసి ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించిన పియేసీ చైర్మన్ ఆరెక పూడి గాంధీ.ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ న్యూ శంకర్ నగర్ కాలనీ లో కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ మరియు దాతల సహకారంతో కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ భవనం ను ప్రారంభించుకోవడం చాలా సంతోషంగా ఉంది అని, కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ భవనం ను కాలనీ సంక్షేమం కోసం ఉపయోగించుకోవాలని, కాలనీ వాసులకు ఎంతగానో ఉపయోగపడుతుంది అని, కాలనీ లో చిన్న చిన్న సమావేశాలు, మహిళా స్వయం సహాయక సంఘాలు మీటింగ్ లు ఏర్పాటు చేసుకోవడానికి, బర్త్ డే మరియు ఇతర ఫంక్షన్ లకు వాడుకోవడానికి ఎంతగానో ఉపయోగపడుతుంది అని తెలియచేశారు. కాలనీ వాసులు అందరూ సమిష్టి కృషి తో కాలనీ అభివృద్ధి లో భాగస్వాములు కావాలని, కాలనీ అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు ఎల్లవేళలో ఉంటాయి అని, కాలనీ అభివృద్ధికి శాయశక్తుల కృషి చేస్తానని,కాలనీ లో అన్ని రకాల మౌలిక వసతులు కల్పించామని, న్యూ శంకర్ నగర్ కాలనీ ని అన్ని రంగాలలో అభివృద్ధి చేసి ఆదర్శవంతమైన కాలనీ గా తీర్చిదిద్దుతామని తెలియచేశారు.ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ అశోక్ గౌడ్ నాయకులు రఘునాథ్ రెడ్డి, మిరియాల ప్రితమ్ , ప్రవీణ్ రెడ్డి, నాయకులు న్యూ శంకర్ నగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## కొత్తపల్లి గ్రామంలో ఘనంగా వినాయక నవరాత్రి వేడుకలు



**యాచారం, సెప్టెంబర్ 14 (జర్నలిస్ట్ డైరీ):** కొత్తపల్లి గ్రామంలో వినాయక నవరాత్రి వేడుకలు భక్తిశ్రద్ధలతో ఘనంగా కొనసాగుతున్నాయి. అభినవ యూత్ ఆధ్వర్యంలో గ్రామంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో ప్రతిష్ఠించిన గణపతి విగ్రహానికి రెండో రోజు ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు.ఈ సందర్భంగా గణనాథునికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.
గ్రామ ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని, గ్రామంలో శాంతి, సౌభాగ్యాలు నెలకొనాలని గణపతిని ప్రార్థించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో అభినవ్ యూత్ సభ్యులతో పాటు పలువురు గ్రామస్తులు, యువత, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రెండేళ్ల పీసీసీ ప్రయాణం సంతృప్తికరం

**- గాంధీ భవన్‌ను ప్రజలకు మరింత చేరువ చేయగలిగాం: పీసీసీ అధ్యక్షుడు బొమ్మా మహేష్ కుమార్ గౌడ్**



**తెలంగాణ బ్యూరో, సెప్టెంబర్ 15 (జర్నలిస్ట్ డైరీ) :** పీసీసీ అధ్యక్షుడిగా రెండేళ్ల ప్రయాణం ఎంతో సంతృప్తికరంగా సాగిందని, గాంధీ భవన్‌ను ప్రజలకు మరింత చేరువ చేయడంతో పాటు కార్యకర్తలకు భరోసా, పార్టీకి బలాన్ని అందించగలిగామని తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు బొమ్మా మహేష్ కుమార్ గౌడ్ అన్నారు.పీసీసీ అధ్యక్షుడిగా రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా షాద్ నగర్ ఎమ్మెల్యే, ప్రభుత్వ రంగ సంస్థల కమిటీ చైర్మన్ వీర్లపల్లి శంకర్ గారు, రంగారెడ్డి జిల్లా డీసీసీ అధ్యక్షుడు చల్లా నరసింహారెడ్డి గారితో కలిసి గాంధీ భవన్ లో సన్మానించారు.
ఈ సందర్భంగా అసెంబ్లీలో సిఎల్పీ కార్యాలయంలో మీడియాతో చిట్‌చాట్‌లో ఆయన మాట్లాడుతూ.. పీసీసీ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేసేందుకు కృషి చేశామని తెలిపారు. కార్యకర్తలకు అండగా నిలుస్తూ వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించగలిగామని అన్నారు. పార్టీ సంస్థాగత నిర్మాణాన్ని మరింత పటిష్టం చేయడంలో విజయవంతమయ్యామని పేర్కొన్నారు. గత రెండేళ్లు సజావుగా సాగడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారితో ఉన్న సమన్వయం ఎంతో దోహదపడిందని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ గారి నుంచి తనకు సంపూర్ణ సహకారం లభించిందని చెప్పారు.గాంధీ భవన్‌ను కేవలం పార్టీ కార్యక్రమాలకే పరిమితం చేయకుండా ప్రజా సమస్యల పరిష్కారానికి వేదికగా మార్చామని మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. మంత్రులను గాంధీ భవన్‌కు ఆహ్వానించి ప్రజలతో ముఖాముఖి కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా అనేక సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తున్నామని తెలిపారు. గాంధీ భవన్ వేదికగా ప్రజా సమస్యల పరిష్కారానికి తోడ్పాటు అందించడం పీసీసీ అధ్యక్షుడిగా తనకు ఎంతో సంతృప్తినిచ్చిందని అన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ గారు మాట్లాడుతూ.. పీసీసీ అధ్యక్షుడిగా రెండేళ్ల కాలంలో పార్టీని బలోపేతం చేయడంతో పాటు గాంధీ భవన్‌ను ప్రజలకు మరింత చేరువ చేసిన బొమ్మా మహేష్ కుమార్ గౌడ్ గారికి అభినందనలు తెలిపారు. రానున్న రోజుల్లో కాంగ్రెస్ పార్టీ మరింత బలంగా ముందుకు సాగాలని ఆకాంక్షించారు.

# వినాయక నిమజ్జన ఏర్పాట్లపై అధికారుల పరిశీలన

**-షాద్‌నగర్ శిరీష, ఏసీపీ లక్ష్మీనారాయణ, మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్, మున్సిపల్ కమిషనర్ సునీతారెడ్డి, పట్టణ సీఐ సీతారాం సందర్శన**



**రంగారెడ్డి జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 15 (జర్నలిస్ట్ డైరీ) :** వినాయక నిమజ్జనాన్ని ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించేందుకు అధికారులు చేపట్టిన ఏర్పాట్లను పరిశీలించారు. షాద్‌నగర్ పట్టణంలోని బొబ్బిలి చెరువు, బుచ్చిగూడ రోడ్డు సమీపంలోని చెరువులను డీసీపీ శిరీష, ఏసీపీ లక్ష్మీనారాయణ, మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్, మున్సిపల్ కమిషనర్ సునీతారెడ్డి, పట్టణ సీఐ సీతారాం సందర్శించారు. ఈ సందర్భంగా నిమజ్జన ప్రదేశాల్లో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. భద్రతా చర్యలు, ట్రాఫిక్ నియంత్రణ, పారిశుద్ధ్య నిర్వహణతో పాటు నిమజ్జనానికి వచ్చే భక్తులకు సౌకర్యాలు కల్పించడంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు పెంటయ్య, రాజు నాయక్, శ్రీశైలం గౌడ్, మున్సిపల్ ఏఈ సాయి కిరణ్, ఇలియాస్, సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

# చలో గోల్కొండ మహాపాదయాత్రను విజయవంతం చేయాలి

**తెలంగాణ రాజ్యాధికార పార్టీ షాద్‌నగర్ నియోజకవర్గ అధ్యక్షుడు ఎమ్మె సంతోష్**



**రంగారెడ్డి జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 15 (జర్నలిస్ట్ డైరీ)** తెలంగాణ రాజ్యాధికార పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు తీన్మార్ మల్లన్న ఆధ్వర్యంలో సెప్టెంబర్ 17న గోల్కొండ కోట నుంచి నిర్వహించనున్న మహాపాదయాత్రను విజయవంతం చేయాలని షాద్‌నగర్ నియోజకవర్గ అధ్యక్షుడు ఎమ్మె సంతోష్ పిలుపునిచ్చారు. షాద్‌నగర్ పట్టణంలో నిర్వహించిన సమావేశానికి ఎమ్మె సంతోష్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాలకు రాజ్యాధికారం సాధించాలనే లక్ష్యంతో తీన్మార్ మల్లన్న చేపడుతున్న మహాపాదయాత్రకు షాద్‌నగర్ నియోజక వర్గంలోని అన్ని వర్గాల ప్రజలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి మద్దతు ఇవ్వాలని కోరారు. టీఆర్‌పీ జిల్లా అధికార ప్రతినిధి భూస జంగన్న మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి ఇప్పటివరకు అణగారిన, పీడిత, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం తీన్మార్ మల్లన్న నిరంతరం కృషి చేస్తున్నారని అన్నారు. బహుజన వర్గాల హక్కులు, రాజ్యాధికారం కోసం చేపడుతున్న ఈ ఉద్యమానికి అన్ని బహుజన వర్గాలు మద్దతు ప్రకటించి మహాపాదయాత్రను విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో తాలూకా ఉపాధ్యక్షుడు మీది కేరి రాధాకృష్ణ, కొందుర్గు మండల అధ్యక్షుడు దర్గ వెంకటేష్, కాశ యాదయ్యతో పాటు టీఆర్‌పీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సరికొత్త మోడల్ బాలేనో కార్ ఆవిష్కరణ

**ముఖ్య అతిథిగా హాజరై ఆవిష్కరించిన ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి**



**రంగారెడ్డి జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 15 (జర్నలిస్ట్ డైరీ)** షాద్‌నగర్ పట్టణ పరిధిలోని మహబూబ్ నగర్ రోడ్డులో గల నెక్సా షోరూంలో సరికొత్త మోడల్ 'బాలెనో కారు ఘనంగా ఆవిష్కృతమైంది. ఈ కార్యక్రమానికి ఉమ్మడి ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై, రిబ్బన్ కట్ చేసి సరికొత్త కారును లాంచ్ చేశారు. ఈ సందర్భంగా షోరూం ప్రతినిధులు మొదటగా ఎమ్మెల్సీ నవీన్ రెడ్డికి ఘనస్వాగతం పలికారు. అనంతరం షోరూంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. సరికొత్త సాంకేతిక పరిజ్ఞానం, వినూత్న డిజైన్, మెరుగైన మైలేజ్ మరియు అధునాతన భద్రతా ప్రమాణాలతో ఈ న్యూ మోడల్ బాలెనో కారును మార్కెట్లోకి తీసుకువచ్చినట్లు నిర్వాహకులు ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నవీన్ రెడ్డికి వెల్లడించారు. కారును ఆవిష్కరించిన అనంతరం ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి వాహనంలోని సరికొత్త ఫీచర్లను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో నెక్సా షోరూమ్ నిర్వాహకులు, సిబ్బంది, కౌన్సిలర్లు బిఎస్ సుధీర్, గౌస్ జానీ, మాజీ కౌన్సిలర్లు కానుగు అనంతయ్య, చింటు ప్రతాప్ రెడ్డి, నందీశ్వర్, ఈశ్వర్ రాజు, యుగేందర్, చెట్ల నరసింహ, చిన్న యాదగిరి, పాలమకుల చెన్నయ్య, కంటెస్టెంట్ కౌన్సిలర్లు నక్కల వెంకటేష్ గౌడ్, సలీం, మాజీ ఎంపిటిసి అశోక్ రెడ్డి, మాజీ సర్పంచ్ హరినాయక్, నాయకులు బిలాల్, శేరి శ్రీనివాస్ రెడ్డి, బంకు శ్రీను, శ్రీకాంత్ గౌడ్, నడికూడ సంతు యాదవ్, అల్లాడ శేఖర్, మల్లేష్, రమేష్ నాయక్, మహిపాల్ గౌడ్, గోపాల్ గౌడ్, సాయి, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

# గిరిజన రిజర్వేషన్ల 10% సాధించి సెప్టెంబర్ 17కి నాలుగేళ్లు

**-తండాల్లో కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకాలు నిర్వహించాలి**

**-గిరిజనుల ఓట్లతో అధికారంలోకి వచ్చారు.. హామీలు మాత్రం గాలికి వదిలేశారు**

**-మూడు గిరిజన కార్పొరేషన్లు ఏమయ్యాయి? రూ.500 కోట్ల హామీ ఎక్కడ?**

**-గిరిజనులకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే అమలు చేయాలి**

**-మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్**



**రంగారెడ్డి జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 15 (జర్నలిస్ట్ డైరీ) :** షాద్‌నగర్‌లోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ అధ్యక్షతన షాద్‌నగర్ నియోజకవర్గ గిరిజన నాయకుల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి నియోజకవర్గంలోని బీఆర్ఎస్ గిరిజన సర్పంచులు, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, మాజీ కౌన్సిలర్లు, మాజీ ప్రజాప్రతినిధులు, గిరిజన నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా అంజయ్య యాదవ్ మాట్లాడుతూ.. తెలంగాణలో గిరిజనుల జనాభా ప్రాతిపదికన 6 శాతంగా ఉన్న రిజర్వేషన్లను 10 శాతానికి పెంచిన ఘనత మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌దేనని అన్నారు. 2022 సెప్టెంబర్ 17న 10 శాతం రిజర్వేషన్లపై నిర్ణయం ప్రకటించబడిన విషయాన్ని గుర్తు చేశారు. ఈ నెల 17వ తేదీకి గిరిజన రిజర్వేషన్ల పెంపు నిర్ణయానికి నాలుగేళ్లు పూర్తవుతున్న సందర్భంగా నియోజకవర్గంలోని అన్ని తండాల్లో కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకాలు నిర్వహించి కృతజ్ఞతలు తెలియజేయాలని గిరిజన నాయకులు, కార్యకర్తలకు అంజయ్య యాదవ్ పిలుపునిచ్చారు.

**కాంగ్రెస్ హామీలు ఏమయ్యాయి?**

2023 ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ గిరిజనులకు అనేక హామీలు ఇచ్చిందని అంజయ్య యాదవ్ అన్నారు. పోడు భూములపై అర్హులైన గిరిజనులందరికీ హక్కులు కల్పించి పట్టాలు ఇస్తామని హామీ ఇచ్చారు. మూడు గిరిజన కార్పొరేషన్లు ఏర్పాటు చేసి, ఒక్కో కార్పొరేషన్‌కు సంవత్సరానికి రూ.500 కోట్ల చొప్పున నిధులు కేటాయిస్తామని చెప్పారు. ప్రతి మండలంలో గిరిజన పాఠశాలలు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. మరి ఆ మూడు గిరిజన కార్పొరేషన్లు ఎక్కడ? ఒక్కో కార్పొరేషన్‌కు సంవత్సరానికి రూ.500 కోట్లు కేటాయిస్తామన్న హామీ ఏమైంది? ఒక్క రూపాయి అయినా కేటాయించారా? ప్రతి మండలంలో గిరిజన పాఠశాలలు ఏర్పాటు చేస్తామని చెప్పిన మాట ఏమైంది? అని అంజయ్య యాదవ్ ప్రశ్నించారు. ఎన్నికల సమయంలో గిరిజనులను ఆకట్టుకునేందుకు హామీలు ఇచ్చి, అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం గిరిజనులను మోసం చేస్తోందని ఆయన విమర్శించారు. గిరిజనుల సంక్షేమం కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన కార్యక్రమాలు, తీసుకున్న నిర్ణయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలుపై గ్రామాలు, తండాల్లో ప్రజలకు వివరించాలని గిరిజన నాయకులకు అంజయ్య యాదవ్ సూచించారు. గిరిజనుల హక్కులు, రిజర్వేషన్లు, సంక్షేమం కోసం బీఆర్ఎస్ పార్టీ నిరంతరం పోరాటం చేస్తుందని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి నియోజకవర్గంలోని ప్రతి తండా నుంచి గిరిజన నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో ముందుకు రావాలని అంజయ్య యాదవ్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు వంకాయల నారాయణరెడ్డి, మాజీ ఎస్సి ఎస్టీ కమీషన్ సభ్యులు రాంబాల్ నాయక్, మాజీ జడ్పీ వైస్ చైర్మన్ ఈట గణేష్, గిరిజన నాయకులు మిట్టు నాయక్, లక్ష్మణ్ నాయక్, రాజు నాయక్, గోపాల్ నాయక్, హన్య నాయక్, అమ్రు నాయక్, రవి నాయక్, రాం చరణ్, లక్ష్మణ్, దశరథ్, హరి నాయక్, లచ్చు నాయక్, కిషన్ నాయక్ తదితరులు, నియోజకవర్గ సర్పంచులు, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, మాజీ ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ గిరిజన శ్రేణులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యలపై ప్రశ్నించడమే కాళోజీకి నిజమైన నివాళి

**-'సాహితీ కళాభారతి' కవిసమ్మేళనంలో పినపాక ప్రభాకర్**

**-హాజరైన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, షాద్‌నగర్ కవులు**



**రంగారెడ్డి జిల్లా బ్యూటీ, సెప్టెంబర్ 15 (జర్నలిస్ట్ డైరీ) :** సమాజంలో జరుగుతున్న అన్యాయాలను ఎదిరించి, ప్రజా సమస్యలపై నిరంతరం ప్రశ్నించడమే ప్రజానాయకుడు, ప్రజాకవి కాళోజీ నారాయణరావుకు ఇచ్చే నిజమైన నివాళి అని కార్మిక సంక్షేమ సంఘం నాయకులు, రచయిత పినపాక ప్రభాకర్ పిలుపునిచ్చారు.

షాద్‌నగర్ రైల్వే స్టేషన్ రోడ్డులోని శాఖా గ్రంథాలయంలో 'సాహితీ కళాభారతి' సంస్థ ఆధ్వర్యంలో కాళోజీ జయంతి సందర్భంగా నిర్వహించిన కవిసమ్మేళనంలో ఆయన పాల్గొని తన స్వీయ రచన "ప్రశ్నించు! పోరాడు!! సాధించు!!!" అనే కవితను వినిపించారు. ఈ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తదితర కవులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. ?ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కాళోజీ కేవలం అక్షరాలను కాగితంపై పేర్చడం నేర్పలేదని, ఆ అక్షరాలకు ప్రజల ఆకలి వాసనను అద్దడం, కష్టాల్లో ఉన్న మనిషి పక్కన నిలబడటం నేర్పారని గుర్తుచేశారు. నిజాం వ్యతిరేక సాయుధ పోరాటం నుండి నిన్నటి స్వరాష్ట్ర ఉద్యమం వరకు, నేటి సిద్ధాపూర్ డంపింగ్ యార్డు, పాలమూరు ప్రాజెక్టులు, డేటా సెంటర్ల పేరుతో మారుతున్న భూ సమీకరణాల వరకు ప్రజల అభిప్రాయాలను విస్మరిస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. అభివృద్ధి అనేది ప్రజల సంక్షేమం కోసమే కావాలని, పేదవాడి కన్నీటి చుక్కే రేపటి తిరుగుబాటుకు మూలవిత్తనమని స్పష్టం చేశారు. అధికార బెదిరింపులకు భయపడకుండా ప్రజా హక్కుల కోసం ప్రతి ఒక్కరూ గొంతుక విప్పాలని, న్యాయం గెలిచే వరకు ప్రజా పోరాటాలు ఆగని నదిలా సాగాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కవిసమ్మేళనంలో సాహితీవేత్తలు, కవులు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొని కాళోజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

**పూర్తి కవిత:**

ప్రశ్నించు! పోరాడు!! సాధించు!!!

అన్యాయం ఎదురైతే
నిశ్శబ్దం నా భాష కాదు
ప్రశ్నే నా ఊపిరి.

నోరు మూయమంటే
నా గొంతు మరింత పదునెక్కుతుంది.
భయపడటం నా నైజం కాదు!
సంధించే ప్రశ్న ఏదైనా అది
నా వ్యక్తిగత స్వార్థం కాదు .
ప్రజల గుండెల్లో రగులుతున్న ధర్మాగ్రహజ్వాల నుండి
పుడుతుంది !

అధికారం బెదిరిస్తే
భయం నా అడుగులను వెనక్కి లాగదు.
అధికారం ఎంత ఎత్తయితే,
ప్రజా ప్రశ్న అంత లోతుగా పాతుకుంటుంది.

పేదవాడి కంటినుంచి జారిన ప్రతి కన్నీటి చుక్క
రేపటి తిరుగుబాటుకు పడిన మూలవిత్తనం!
సమాధానం అనే మొలక తొడిగే వరకు
ప్రశ్న ఆగదు...
పోరాటం అలసిపోదు!

రైతు పొలంలో చిందించే చెమట
ఈ నేల నుదుటిపై రాసిన సత్యం.
కార్మికుడి బిగిసిన పిడికిలి
శ్రమకు మిగిలిన చివరి సంతకం.
ప్రజల కళ్లలో మిగిలిన ఆశ
చీకటిలో ఆరని చివరి దీపం.

అది వెలుగుతున్నంతకాలం
ప్రజా గొంతుక మూగబోదు!

నాటి నిజాం వ్యతిరేక రైతాంగ సాయుధ
పోరాటంమైనా... మొన్నటి స్వరాష్ట్ర ఉద్యమమైన,,,,
నేటి సిద్ధాపూర్ డంపింగ్ యార్డు ఉద్యమమైనా...
పాలమూరు ప్రాజెక్టులపై ప్రశ్నలైనా...
డేటా సెంటర్ల పేరుతో మారుతున్న భూమి
జీవన సమీకరణాలైనా...
స్థానిక నిరుద్యోగ యువత భవిష్యత్తైనా...
ప్రశ్న ఒక్కటే

ఈ నేల ఎవరిది?
ఈ అభివృద్ధి ఎవరి కోసం?
ఈ నిర్ణయాల్లో
ప్రజల మాట ఎక్కడ?

ఈ ప్రశ్నలకు బదులు దొరకనంతవరకు
ప్రజల గొంతుక
పీఠాలను కదిలించే పెనుగర్జన!

కాళోజీ...
నేర్పింది
అక్షరాలను కాగితంపై పేర్చడం కాదు
వాటికి ప్రజల ఆకలి వాసనను అద్దడం.
కష్టాల్లో ఉన్న మనిషి పక్కన నిలబడటం.
అన్యాయం ముందు తలవంచకపోవడం.
నిజం ఒంటరిగా ఉన్నా
దాని వైపే నిలబడి కలెబడడం

ఆయన జయంతికి పూలమాల వేయడం కాదు...
అన్యాయాన్ని ప్రశ్నిద్దాం.
ఒక బాధితుడి కన్నీటిని తుడుద్దాం.
ఒక హక్కు కోసం అడుగు ముందుకు వేద్దాం.
వేదికపై పలికే మాటల్లో కాదు
ప్రజల మధ్య నిలిచే మన అడుగుల్లో ఉంది.

ప్రశ్నించే గొంతులు
ఒక్కొక్కటిగా వెలిగే కాగడాలవ్వాలి.
పోరాడే చేతులు
ఒకదానికొకటి అండగా నిలిచే భుజాలవ్వాలి
న్యాయం గెలిచే వరకు
ప్రజా పోరాటం
ఆగని నదిలా ప్రవహించాలి.

ప్రజలే బలం
ప్రజలే చరిత్ర
ప్రజల పక్షాన ప్రశ్నించడమే
కాళోజీకి నిజమైన నివాళి!

# పోలీసుల ఎదుట విచారణకు హాజరైన యూట్యూబర్ నందన

**-గడువుకు ఒకరోజు ముందే పోలీసుల ఎదుట హాజరైన యూట్యూబర్ నందన**

**-విదేశీ ఉద్యోగాల పేరుతో మోసం చేశారనే ఆరోపణలు**

**-ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు**



**ఇబ్రహీంపట్నం,ఎన్టీఆర్ జిల్లా, ఏపీ బ్యూరో,జర్నలిస్ట్ డైరీ :** విదేశీ ఉద్యోగాల పేరిట మోసాలకు పాల్పడ్డారనే ఆరోపణలు ఎదుర్కొంటున్న యూట్యూబర్ నందన, గడువు కంటే ఒకరోజు ముందే మరోసారి పోలీసుల ఎదుట విచారణకు హాజరయ్యారు. ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్‌లో మంగళవారం సాయంత్రం అధికారులు ఆమెను విచారించారు. వాస్తవానికి, ఆమె సెప్టెంబర్ 16వ తేదీలోగా విచారణకు హాజరుకావాల్సి ఉండగా, ఒకరోజు ముందుగానే న్యాయవాదులతో కలిసి రావడం గమనార్హం.

**మూడు గంటల పాటు కొనసాగిన విచారణ**

సుమారు మూడు గంటల పాటు కొనసాగిన ఈ విచారణలో పోలీసులు ఆమెకు 20 ప్రశ్నలు సంధించారు. కన్సల్టెన్సీ వ్యవహారాలన్నీ తన భర్త పర్యవేక్షించేవారని, ఆ లావాదేవీలతో తనకు ఎటువంటి సంబంధం లేదని ఆమె పోలీసులకు తెలిపినట్లు సమాచారం. తనపై జారీ చేసిన లుక్ అవుట్ నోటీసులను ఉపసంహరించుకోవాలని ఆమె ఈ సందర్భంగా పోలీసులను కోరారు. విచారణకు తాము పూర్తిస్థాయిలో సహకరిస్తామని ఆమె హామీ ఇవ్వగా, ఆ విన్నపాన్ని పరిశీలిస్తామని పోలీసులు వెల్లడించారు.

**విదేశాల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామనే నెపంతో మోసం..**

విదేశాల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామనే నెపంతో నందన, ఆమె భర్త పలువురిని మోసం చేశారని ఆరోపణలు వెల్లువెత్తాయి. బాధితుల నుంచి అందిన ఫిర్యాదుల మేరకు ఇబ్రహీంపట్నం పోలీసులు వారిపై కేసు నమోదు చేశారు. ఈ విషయం వెలుగులోకి రావడంతో ఆ దంపతులిద్దరూ అజ్ఞాతంలోకి వెళ్లగా, ఆంధ్రప్రదేశ్ పోలీసులు వారిపై లుక్ అవుట్ సర్క్యులర్ జారీ చేశారు.

**ఇటీవల శంషాబాద్ విమానాశ్రయంలో అదుపులోకి తీసుకున్న ఇమ్మిగ్రేషన్ అధికారులు**

ఇటీవల బ్రిటిష్ ఎయిర్‌వేస్ విమానంలో విదేశాల నుంచి శంషాబాద్ విమానాశ్రయానికి చేరుకున్న నందనను ఇమ్మిగ్రేషన్ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. ఆమె పాస్‌పోర్ట్, వీసా తనిఖీ చేసిన అధికారులు, ఆమెపై ఎల్ఓసీ ఉన్నట్లు గుర్తించి వెంటనే ఇబ్రహీంపట్నం పోలీసులకు సమాచారం అందించి అప్పగించారు. ఆ సమయంలో ఆమెను ప్రాథమికంగా విచారించి, మరోసారి విచారణకు రావాల్సి ఉంటుందని నోటీసులు ఇచ్చారు. ఈ నేపథ్యంలోనే ఆమె నిర్దేశిత గడువు కంటే ముందే పోలీసుల విచారణకు హాజరయ్యారు..కాగా మరో కేసు ప్రకాశం జిల్లా అద్దంకి పోలీసులు నమోదు చేసిన విషయం తెల్సిందే.

# మానవత సెంట్రల్ కన్వీనర్‌గా కపురం శ్రీనివాసరెడ్డి





**ఒంగోలు,ప్రకాశం బ్యూరో, జర్నలిస్ట్ డైరీ :** మానవత స్వచ్ఛంద సేవాసంస్థ సెంట్రల్ కన్వీనర్‌గా ఉమ్మడి ప్రకాశం జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ప్రకాశం జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ కపురం శ్రీనివాసరెడ్డి నియమితులయ్యారు.

**మహోన్నతమైన ఆశయాలు, విలువలతో మానవత స్వచ్ఛంద సేవా సంస్థ**

ఈ సందర్భంగా శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. మానవతా సంబంధాలు, విలువలు క్రమంగా కనుమరుగవుతున్న ప్రస్తుత సమాజంలో మహోన్నతమైన ఆశయాలు, విలువలతో మానవత స్వచ్ఛంద సేవా సంస్థను ఎన్. రామచంద్రా రెడ్డి స్థాపించారని తెలిపారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో 147 శాఖలు, 98 వేల మంది సభ్యులతో మానవత సంస్థ నిరుపేదలు, ఆపదలో ఉన్న అభాగ్యులకు ఎలాంటి ప్రతిఫలాపేక్ష లేకుండా నిరంతరం ఉచిత సేవలు అందిస్తూ ప్రజలకు చేరువైన సంస్థగా రాష్ట్ర వ్యాప్తంగా గుర్తింపు పొందిందన్నారు.

**స్వచ్ఛందంగా సేవలు**

సంస్థలో విద్యావంతులు, కార్మికులు, ఉద్యోగులు, మేధావులు పెద్ద సంఖ్యలో సభ్యులుగా చేరి, సమాజంలోని అనేక రుగ్మతలను అధిగమించేందుకు స్వచ్ఛందంగా సేవలందిస్తున్నారని పేర్కొన్నారు. ఎవరూ చేయలేని, చేయడానికి ముందుకు రాని అనేక సేవలను మానవత సభ్యులు ఉచితంగా అందిస్తున్నారని, వారి సేవలు అమూల్యమైనవని కొనియాడారు.

**నిరుపేదలకు మానవత సంస్థ అండగా**

కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా ఎలాంటి వివక్ష లేకుండా దుఃఖంలో ఉన్న అభాగ్యులకు, ఆకలితో అలమటిస్తున్న నిరుపేదలకు మానవత సంస్థ అండగా నిలుస్తోందన్నారు. ఇలాంటి సేవా కార్యక్రమాలను ప్రజలందరూ ఆదరించి, సేవాతత్పరులకు సహకారం అందించాలని కోరారు.

**నవశాంతి సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరి సహకారం అవసరం**

దుఃఖంలో ఉన్న వారి చివరి కన్నీటి బొట్టునైనా ఆపేందుకు చేసే ప్రయత్నమే మానవత స్వచ్ఛంద సేవాసంస్థ ధ్యేయమని కపురం శ్రీనివాసరెడ్డి తెలిపారు. నవశాంతి సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరి తోడ్పాటు, సహకారం అవసరమని ఆయన అన్నారు.

# వినాయక విగ్రహాల నిమజ్జనం జరిగే ప్రాంతాల్లో పటిష్ట భద్రతా ఏర్పాట్లు

**-ప్రకాశం జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజు**

**-కొత్తపట్నం, పాకల తీర ప్రాంతాల్లో నిమజ్జనాలు జరిగే ప్రదేశాలను పరిశీలించిన ఎస్పీ**

**-చిన్న పిల్లలు సముద్రంలో దిగకుండా జాగ్రత్తలు పాటించాలి**

**-నిర్దేశిత సమయాల్లోనే నిమజ్జనాలు పూర్తి చేయాలని అధికారులకు ఆదేశాలు**





**ఒంగోలు, ప్రకాశం బ్యూరో, జర్నలిస్ట్ డైరీ :** వినాయక చవితి ఉత్సవాల అనంతరం నిర్వహించే వినాయక విగ్రహాల నిమజ్జనాలను దృష్టిలో ఉంచుకుని, జిల్లాలో అధిక సంఖ్యలో నిమజ్జనాలు జరిగే కొత్తపట్నం, పాకాల తీర ప్రాంతాలను మంగళవారం జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు సందర్శించారు. ఈ సందర్భంగా నిమజ్జన ప్రదేశాలను పరిశీలించి, పోలీసు శాఖ చేపట్టిన భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించారు.నిమజ్జనం జరుగుతున్న ప్రదేశాలలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఉండేందుకు పోలీసు శాఖ ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు చేపట్టింది. నిమజ్జనాల వద్ద డ్రోన్లు మరియు సీసీ కెమెరాల ద్వారా నిఘా ఉంచారు.భద్రతా సిబ్బంది, ప్రత్యేక పోలీసు బృందాలు కూడా విధుల్లో భాగంగా పాల్గొన్నారు.తీర ప్రాంతాల్లో నిమజ్జన ప్రక్రియ ప్రశాంతంగా, సజావుగా మరియు సురక్షితంగా జరిగేలా చేపట్టాల్సిన ముందస్తు జాగ్రత్తలు, ట్రాఫిక్ నియంత్రణ, భక్తుల భద్రత తదితర అంశాలపై జిల్లా ఎస్పీ సంబంధిత పోలీసు అధికారులకు పలు సూచనలు చేశారు. విగ్రహాల నిమజ్జనాల్లో ఎలాంటి అపశ్రుతులు లేదా అవాంతరాలు తలెత్తకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని, నిమజ్జన కార్యక్రమానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ప్రమాదాలు సంభవించకుండా అన్ని భద్రతా చర్యలు చేపట్టాలని జిల్లా ఎస్పీ పోలీసు అధికారులను ఆదేశించారు.

**నిర్దేశిత సమయాల్లోనే నిమజ్జనాలు జరగేలా చూడాలి**

నిర్దేశిత సమయాల్లోనే నిమజ్జనాలు జరగేలా చూడాలని, ట్రాఫిక్‌ను సమర్థవంతంగా నియంత్రించాలని, భక్తులు ఎక్కువ లోతులోకి వెళ్ళకుండా, చిన్న పిల్లలు సముద్రంలో దిగకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని సూచించారు. పబ్లిక్ అడ్రసింగ్ సిస్టం ద్వారా ప్రజలకు ఎప్పటికప్పుడు భద్రతా సూచనలు, నిమజ్జనానికి సంబంధించిన మార్గదర్శకాలను తెలియజేస్తూ ఉండాలన్నారు.

**నిమజ్జన ప్రాంతాల్లో గజ ఈతగాళ్ళు, హెచ్చరిక బోర్డులు**

నిమజ్జన ప్రాంతాల్లో గజ ఈతగాళ్ళు, హెచ్చరిక బోర్డులు, కట్‌ఆఫ్ బోట్లు, లైట్లు, లైఫ్ జాకెట్లు, నాటు పడవలు వంటి అవసరమైన భద్రతా సామగ్రిని అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. గజ ఈతగాళ్లకు ప్రత్యేక టీ-షర్టులు అందజేయడం ద్వారా వారు సులభంగా గుర్తించబడేలా చర్యలు తీసుకున్నట్లు ఎస్పీ తెలిపారు. భద్రతా చర్యల్లో భాగంగా మెరైన్ పోలీసులు కూడా విధుల్లో పాల్గొని సేవలు అందించనున్నారు.

**ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ**

వినాయక విగ్రహాల నిమజ్జన ప్రక్రియను ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించేందుకు పోలీసు శాఖ తరఫున అన్ని భద్రతా, బందోబస్తు చర్యలు చేపట్టామని జిల్లా ఎస్పీ తెలిపారు. భక్తులకు ఎలాంటి ఆటంకం కలగకుండా పోలీసులు, మెరైన్ పోలీసులు సమన్వయంతో విధులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నిమజ్జన ప్రాంతాల్లో గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచడంతో పాటు, లైఫ్ జాకెట్లను సిద్ధంగా ఉంచామని తెలిపారు. నిమజ్జనం జరిగే కొత్తపట్నం, పాకాల తీర ప్రాంతాల్లో అదనపు ఎస్పీలను ప్రత్యేకంగా నియమించినట్లు వివరించారు. భక్తులు పోలీసులకు సహకరిస్తూ, పోలీసుల సూచనలు పాటించి నిమజ్జన కార్యక్రమాన్ని సజావుగా పూర్తి చేయాలని కోరారు.వినాయక చవితి సందర్భంగా జిల్లా వ్యాప్తంగా కాలువలు, చెరువులు, నదులు తదితర నిమజ్జన ప్రదేశాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీస్ స్టేషన్ అధికారులు కట్టుదిట్టమైన ముందస్తు భద్రతా చర్యలు చేపట్టినట్లు తెలిపారు.

**లోతైన నీటిలోకి వెళ్లకుండా జాగ్రత్తలు పాటించాలి**

గణేష్ నిమజ్జన ప్రదేశాల్లో ఈత రాని వారు, చిన్నపిల్లలు, వృద్ధులు, అనారోగ్యంతో ఉన్నవారు లోతైన నీటిలోకి వెళ్లకుండా జాగ్రత్తలు పాటించాలని జిల్లా ఎస్పీ సూచించారు. ప్రజలు నిర్దేశిత సమయాల్లోనే నిమజ్జన కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు. నిమజ్జన ప్రాంతాల్లో ట్రాఫిక్‌కు ఎలాంటి అంతరాయం కలగకుండా, ట్రాఫిక్‌ను సమర్థవంతంగా నియంత్రించేందుకు పోలీసులు తగిన ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. జిల్లా ఎస్పీ వెంట అడిషనల్ ఎస్పీ యన్.యుగంధర్ బాబు, ఒంగోలు డిఎస్పీ ఆర్.శ్రీనివాసరావు, ఎస్ బి ఇన్స్పెక్టర్ శ్రీనివాసరావు, ఒంగోలు టు టౌన్ సీఐ వీర నాయక్, ఒంగోలు రూరల్ సీఐ శేషగిరిరావు,కొత్తపట్నం మెరైన్ సీఐ రమేష్ బాబు, కొత్తపట్నం ఎస్సై సుధాకర్, సింగరాయకొండ ఎస్సై సుధీర్ కుమార్, మెరైన్ ఎస్సై సుబ్బారావు మరియు సిబ్బంది ఉన్నారు.

# పరిశ్రమలకు రూ.16.60 కోట్ల రాయితీ

**-యూనిట్ల స్థాపనకు త్వరగా ప్లాట్లు కేటాయించాలి**

**-ప్రకాశం జిల్లా కలెక్టర్ కలెక్టర్ రాజాబాబు ఆదేశం**







**ఒంగోలు ప్రకాశం బ్యూరో, జర్నలిస్ట్ డైరీ :** జిల్లా లోని పరిశ్రమలకు సంబంధించిన 222 క్లెయిములకు రూ.16.60 కోట్ల రాయితీలను జిల్లా పరిశ్రమలు, ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ మంజూరు చేసింది. మంగళవారం జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు అధ్యక్షతన ప్రకాశం భవనములో ఈ కమిటీ సమావేశం జరిగింది. పరిశ్రమల స్థితిగతులను జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ శ్రీనివాసరావు ఈ సందర్భంగా వివరించారు. ఇండోసోల్ బిపిసిఎల్ జేఎస్డబ్ల్యు బీడీఎల్ వంటి మెగా ప్రాజెక్టుల పురోగతిపై కలెక్టర్ ఆరా తీశారు.

**సమస్యలను పరిష్కరించి, పనులను వేగవంతం చేయాలి**


ఆయా ప్రాజెక్టుల అమలులో ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించి, పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఫ్యామిలీ వన్ ఎంటర్ప్రెన్యూర్ కార్యక్రమం ద్వారా ప్రతి కుటుంబం నుంచి ఒక పారిశ్రామికవేత్తను తయారు చేసే దిశగా అవసరమైన కార్యాచరణ చేపట్టాలని అధికారులకు మార్గ నిర్దేశం చేశారు. సింగిల్ డెస్క్ పోర్టల్ ద్వారా అందిన దరఖాస్తులను వేగంగా పరిష్కరించి, పారిశ్రామికవేత్తలకు ఎటువంటి జాప్యం లేకుండా అనుమతులు మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. ' ఎలైట్ బిజినెస్ మీట్ ' లో నమోదైన యూనిట్ల పురోగతిని నిరంతరం పర్యవేక్షిస్తూ, వాటిని సాధ్యమైనంత త్వరగా గ్రౌండింగ్ చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు.

**అవసరమైన భూమిని త్వరితగతిన కేటాయించేలా ఆదేశం**

ఆసక్తి చూపుతున్న యూనిట్లకు అవసరమైన భూమిని త్వరితగతిన కేటాయించేలా ఏపీఐఐసీ అధికారులను ఆదేశించారు. అలాగే, ఎలైట్ బిజినెస్ మీట్‌లో పాల్గొన్న ఉత్సాహవంతులైన యూనిట్ హోల్డర్లకు బ్యాంకు రుణాలు త్వరితగతిన మంజూరయ్యేలా అవసరమైన సహకారం అందించి, రుణ సౌకర్యాలను సులభతరం చేయాలని ఎల్.డీ.ఎం.కు స్పష్టం చేశారు. జిల్లాలో పరిశ్రమల స్థాపనకు ప్రభుత్వం కల్పించే సౌకర్యాలతో కూడిన పోస్టరు ను ఈ సమావేశంలో ఆవిష్కరించారు.

ఈ సమావేశంలో నాబార్డ్ డీడీఎం రవికుమార్, ఎల్ డి ఎం రమేష్, జిల్లా రిజిస్ట్రార్ బాలాంజనేయులు, ఏపీ సిపిడిసిఎల్ ఎస్.ఈ. వెంకటేశ్వర్లు, ఏపీఐఐసీ, నెడ్ క్యాప్ అధికారులు పాల్గొన్నారు.

# వినాయక చవితి ఉత్సవాలను ఘనంగా జరిపించిన మహబూబ్నగర్ మేయర్ గుమ్మాల్ మమత



**మిడ్జిల్, సెప్టెంబర్ 15,జర్నలిస్ట్ డైరీ :** మహబూబ్ నగర్ మేయర్ గుమల్ మమత వినాయక చవితి సందర్భంగా క్రాంతి నగర్ కాలనీలో వినాయక ఉత్సవాలను ఘనంగా జరిపించారు. మరియు ఐమాక్స్ లైట్ ఓపెనింగ్ చేసి కాలనీవాసుల కళ్ళల్లో వెలుతురు చూశారు. కాలనీవాసులు మేయర్ ని ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. మేయర్ గుమాల్ మమతా వినాయక చవితి ఉత్సవాల భాగంగా ఆమె అక్కడ వచ్చి పూజా కార్యక్రమాలు చేసి వివిధ అభివృద్ధి పనులు నేను ముందుండీ చేపిస్తానని కాలనీ వాళ్లకు హామీ ఇచ్చి మూడో డివిజన్, అభివృద్ధి కార్యక్రమాలు చేస్తానని మాట ఇవ్వడం హాయ్ మ్యాక్స్ లేట్ ఓపెనింగ్ చేసి, వాళ్లతో ముచ్చటించి ఈ సందర్భంగా కాలనీవాసులు సంతోషంగా వ్యక్తం చేశారు ఇలాంటి నాయకులు మాకు ఉన్నందుకు ఏ లాంటి ఇబ్బందులు లేవు,అని చెప్పి కానీ వాసులు హర్షం వ్యక్తం చేశారు

## నేడు నెల్లూరు జిల్లాకు మంత్రి లోకేశ్..

-పలు కార్యక్రమాలకు శ్రీకారం

-నెల్లూరు నగరంలో ఆధునికీకరించిన రెండు ప్రభుత్వ పాఠశాలల ప్రారంభోత్సవం

-కోవూరులో ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించనున్న లోకేశ్

-కోవూరు నియోజకవర్గ టీడీపీ నేతలు, కార్యకర్తలతో సమన్వయ సమావేశం



**అమరావతి, ఏపీ బ్యూరో, జర్నలిస్ట్ డైరీ :** రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ నేడు (సెప్టెంబర్ 16) నెల్లూరు జిల్లాలో పర్యటించనున్నారు. ఒకే రోజు రెండు నియోజకవర్గాల్లో ఆయన పలు అభివృద్ధి, పార్టీ కార్యక్రమాల్లో పాల్గొంటారు. ఇందుకు సంబంధించిన అధికారిక షెడ్యూల్ వివరాలు విడుదలయ్యాయి.

**పర్యటనలో భాగంగా**

పర్యటనలో భాగంగా తొలుత ఉదయం నెల్లూరు సిటీ నియోజకవర్గానికి చేరుకుంటారు. ఉదయం 10 గంటలకు స్టోన్ హౌస్ పేటలోని ఆర్ఎస్ఆర్ ప్రభుత్వ పాఠశాల ఆధునీకరణ పనులను, 11:10 గంటలకు మూలపేటలోని డీఎస్ఆర్ ప్రభుత్వ పాఠశాల భవనాన్ని ప్రారంభిస్తారు. విద్యార్థులు, ఉపాధ్యాయులతో ముచ్చటించే అవకాశం ఉంది.

**మధ్యాహ్నం కోవూరు నియోజకవర్గంలో పర్యటన**

మధ్యాహ్నం కోవూరు నియోజకవర్గంలో పర్యటన కొనసాగుతుంది. 12:15 గంటలకు కోవూరు పట్టణంలోని నెల్లూరు బైపాస్ వద్ద ఏర్పాటు చేసిన స్వర్గీయ నందమూరి తారక రామారావు విగ్రహాన్ని ఆవిష్కరిస్తారు. అనంతరం మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు చెన్నై-విజయవాడ హైవే వద్ద ఏర్పాటు చేసిన వేదికపై కోవూరు నియోజకవర్గ టీడీపీ కార్యకర్తలు, నాయకులతో జరిగే సమన్వయ సమావేశంలో పాల్గొని దిశానిర్దేశం చేస్తారు. ఈ పర్యటనకు సంబంధించి స్థానిక టీడీపీ నేతలు ఏర్పాట్లు పూర్తి చేశారు

## మాజీ ఉప ముఖ్యమంత్రి ఆళ్ల నాని హఠాన్మరణం

-గుండెపోటుతో ఆళ్ల నాని మృతి

1969లో ఏలూరులో జన్మించిన ఆళ్ల నాని

-గత ఏడాది వైసీపీని వీడి టీడీపీలో చేరిన నాని



**విశాఖ, ఏపీ బ్యూరో, జర్నలిస్ట్ డైరీ :** ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో తీవ్ర విషాదం చోటు చేసుకుంది. ఏపీ మాజీ డిప్యూటీ సీఎం ఆళ్ల నాని గుండెపోటుతో హఠాన్మరణం చెందారు. విశాఖలోని తన నివాసంలో ఆయనకు అకస్మాత్తుగా గుండెపోటు రావడంతో కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించేలోపే ప్రాణాలు విడిచారు. ఆయన ఆకస్మిక మృతి వార్త ఏలూరు నియోజకవర్గంతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా రాజకీయ వర్గాలను, పార్టీ శ్రేణులను తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసింది.

# ధ్వజారోహణంతో మొదలైన శ్రీవారి బ్రహ్మోత్సవాలు..

## -పట్టువస్త్రాలు సమర్పించిన సీఎం చంద్రబాబు

-తిరుమలలో బ్రహ్మోత్సవాల శోభ

-ధ్వజస్తంభంపై గరుడ పటాన్ని ఎగురవేసిన వేదపండితులు

-కుటుంబ సభ్యులతో కలిసి విచ్చేసిన చంద్రబాబు

-రాష్ట్ర ప్రభుత్వం తరపున పట్టువస్త్రాలు సమర్పించిన సీఎం









**తిరుమల, ఏపీ బ్యూరో, జర్నలిస్ట్ డైరీ :** కలియుగ ప్రత్యక్ష దైవం తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు మంగళవారం సాయంత్రం ధ్వజారోహణంతో అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. ఇదే సమయంలో, రాష్ట్ర ప్రభుత్వం తరఫున ముఖ్యమంత్రి చంద్రబాబు స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు. ఈ రెండు ప్రధాన ఘట్టాలతో తిరుమల గిరులు గోవింద నామస్మరణతో మార్మోగాయి. బ్రహ్మోత్సవాల ప్రారంభ సూచికగా, శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ మలయప్పస్వామి వారి సమక్షంలో పండితుల వేద మంత్రోచ్ఛారణలు, మంగళ వాయిద్యాల నడుమ అర్చక స్వాములు బంగారు ధ్వజ స్తంభంపై గరుడ పటాన్ని ఎగుర వేశారు. ఈ ధ్వజారోహణం ద్వారా సకల దేవతలను, అష్టదిక్పాలకులను, సకల జీవరాశులను బ్రహ్మోత్సవాలకు ఆహ్వానించడం సంప్రదాయం. ఈ కార్యక్రమంతో తొమ్మిది రోజుల ఉత్సవాలకు వైభవంగా తెరలేచింది.

**రాష్ట్ర ప్రభుత్వం తరఫున శ్రీవారికి పట్టు వస్త్రాలు సమర్పించిన సీఎం చంద్రబాబు**

మరోవైపు, ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్ర ప్రభుత్వం తరఫున శ్రీవారికి పట్టువస్త్రాలు సమర్పించే సంప్రదాయాన్ని పాటించారు. సాయంత్రం రేణిగుంట విమానాశ్రయానికి చేరుకున్న ఆయనకు టీడీపీ నేతలు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన కుటుంబ సమేతంగా తిరుమలకు చేరుకున్నారు. సీఎం వెంట ఆయన అర్ధాంగి నారా భువనేశ్వరి, కుమారుడు, రాష్ట్ర మంత్రి నారా లోకేశ్, కోడలు నారా బ్రహ్మణి ఉన్నారు.

**సంప్రదాయ వస్త్రధారణలోముఖ్యమంత్రి చంద్రబాబు**

సంప్రదాయ వస్త్రధారణలో ఆలయానికి చేరుకున్న ముఖ్యమంత్రి, ముందుగా బేడి ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. ఆ తర్వాత పట్టువస్త్రాలను తలపై ఉంచుకుని, మంగళవాయిద్యాల నడుమ ఊరేగింపుగా ఆలయంలోకి ప్రవేశించి స్వామివారికి వస్త్రాలు సమర్పించారు. అనంతరం వారు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ముఖ్యమంత్రికి అర్చకస్వాములు వేదాశీర్వచనం పలికి, స్వామివారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ పర్యటనలో చంద్రబాబు వెంట టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, ఇతర నేతలు, అధికారులు ఉన్నారు. ప్రముఖ సంగీత దర్శకుడు తమన్ కూడా ఈ సందర్భంగా ఆలయంలో కనిపించారు

# ‘ఒంగోలు’లో ఈ నెల 19న మెగా "శానిటేషన్" డ్రైవ్

-అధికారులకు ప్రకాశం జిల్లా కలెక్టర్ రాజాబాబు దిశా నిర్దేశం

-బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్' లో నిలిచేలా నిర్వహణ ఉండాలన్న కలెక్టర్

-ఎమ్మెల్యే జనార్ధన్, ఒనుడా చైర్మన్ రియాజ్ తో ప్రత్యేక సమావేశం





**ఒంగోలు, ప్రకాశం బ్యూరో, జర్నలిస్ట్ డైరీ :** ఒంగోలు మున్సిపాలిటీ ఏర్పడి 150 ఏళ్లు అవుతున్న సందర్భంగా నిర్వహిస్తున్న కార్యక్రమాలలో భాగంగా పారిశుద్ధ్య నిర్వహణపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించేలా ఈ నెల 19వ తేదీన ‘ మెగా శానిటేషన్ డ్రైవ్ ‘ నిర్వహించబోతున్నట్లు కలెక్టర్ మరియు మున్సిపాలిటీ స్పెషల్ ఆఫీసర్ పి.రాజాబాబు తెలిపారు.ఈ సందర్భంగా కార్యక్రమ నిర్వహణపై ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన రావు, ఒంగోలు పట్టణాభివృద్ధి సంస్థ చైర్మన్ షేక్ రియాజ్ లతో కలిసి మంగళవారం ప్రకాశం భవనంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమ నిర్వహణకు తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు వారు దిశానిర్దేశం చేశారు.

**‘బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్’ లో నిలిచేలా నిర్వహణ...**

మున్సిపాలిటీ పరిధిలోని 80 వేలకు పైగా ఉన్న ఇళ్ల నుంచి తడి చెత్త, పొడి చెత్తను వేరువేరుగా సేకరించేలా ప్రతి ఇంటికీ ప్రత్యేక నంబర్లతో కూడిన 2 కవర్లను ముందుగానే పంపిణీ చేయాలని కలెక్టర్ చెప్పారు. మెగా శానిటేషన్ డ్రైవ్ రోజున చెత్త సేకరణ ప్రక్రియను పర్యవేక్షించేలా ప్రతి 50 ఇళ్లకు ఒకరిని కేటాయించాలని, వీరిపైన పర్యవేక్షణ చేసేందుకు ప్రత్యేకంగా ఒక అధికారిని నియమించాలని చెప్పారు. చెత్త తరలింపునకు కూడా ప్రత్యేక వాహనాల కేటాయింపు, వాటికి మార్గాన్ని నిర్దేశించడంలోనూ ముందస్తుగా ప్రణాళిక రూపొందించాలన్నారు. ఈ శానిటేషన్ డ్రైవ్ ‘ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ ‘ లో నిలిచేలా చేపట్టాలన్నారు. ఇందుకోసం మున్సిపాలిటీ, మెప్మా ఇబ్బందిని వినియోగించుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఐదుగురు జిల్లాస్థాయి అధికారులను కూడా పరివేక్షించేలా నియమిస్తామన్నారు.

**ప్రతి ఇంటికి ‘ మన ఒంగోలు - మన గౌరవం ‘ నినాదంతో వెళ్లేలా చర్యలు**

మెగా శానిటేషన్ డ్రైవ్ పైన ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలన్నారు. కరపత్రాల ద్వారా ప్రతి ఇంటికీ తెలియజేయాలని, ఫ్లెక్సీలు, హోర్డింగులతోనూ అవగాహన కల్పించాలని జనార్ధన్, రియాజ్ సూచించారు. స్కూల్, కాలేజీ విద్యార్థులకు కూడా అవగాహన కల్పించాలన్నారు. చెత్తను సేకరించే ప్రక్రియలో ఇంజనీరింగ్ విద్యార్థులను కూడా వినియోగించుకోవచ్చని సూచించారు. ఈ డ్రైవ్ అనంతరం వ్యర్థాల నిర్వహణలో ఇదే స్ఫూర్తిని కొనసాగించేలా ప్రతి ఇంటికి ‘ మన ఒంగోలు - మన గౌరవం ‘ నినాదంతో ప్రింట్ చేయించిన 2 ప్రత్యేక డస్ట్ బిన్నులు కూడా ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని వారు చెప్పారు. ఒంగోలు మున్సిపాలిటీ 150 ఏళ్ల వేడుకలను పురస్కరించుకొని నగరం మొత్తం విద్యుత్ దీపాలంకరణ చేపట్టాలని కూడా ఈ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు.కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటకృష్ణయ్య, అసిస్టెంట్ కమిషనర్ నగేష్, మున్సిపల్ ఇంజనీర్ యెషయా, డి.ఈ.ఈ. పద్మజ, హెల్త్ ఆఫీసర్ వైష్ణవి, శానిటరీ ఇన్స్పెక్టర్లు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

# ప్రైవేటు కోచింగ్ సెంటర్లపై చంద్రబాబు సీరియస్...

-కఠిన చర్యలకు ఆదేశం


-ప్రభుత్వంపై బురద జల్లేందుకు అభ్యర్థులను రెచ్చగొడుతున్నాయని కోచింగ్ సెంటర్లపై ఆరోపణ

-రాజకీయ ప్రయోజనాల కోసమేనని ప్రభుత్వ నిర్ధారణ

-జీవో నెం.9 నిబంధనలను ఉల్లంఘిస్తున్నారని వెల్లడి

-రాజకీయ కుట్రల్లో భాగస్వాములను చేస్తే సహించేది లేదని స్పష్టీకరణ

**అమరావతి, ఏపీ బ్యూరో, జర్నలిస్ట్ డైరీ :** పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులను ప్రభుత్వానికి వ్యతిరేకంగా రెచ్చగొడుతున్న ప్రైవేటు కోచింగ్ కేంద్రాలపై కఠిన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. ప్రభుత్వంపై బురదజల్లే లక్ష్యంతో విద్యార్థులను ఆందోళనలకు ఉసిగొల్పుతున్నారని ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తోంది. ఈ మేరకు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే సంస్థలపై చట్టప్రకారం ముందుకెళ్లాలని స్పష్టం చేశారు.కొన్ని ప్రైవేటు కోచింగ్ కేంద్రాల యాజమాన్యాలు తమ స్వార్థ, రాజకీయ ప్రయోజనాల కోసం అభ్యర్థుల భవిష్యత్తుతో ఆడుకుంటున్నట్లు ప్రభుత్వం దృష్టికి వచ్చింది. పోటీ పరీక్షల కోసం తమ వద్ద శిక్షణ పొందుతున్న యువతపై ఒత్తిడి తెచ్చి, వారిని రాజకీయ ప్రేరేపిత నిరసనలు, ధర్నాలలో పాల్గొనేలా చేస్తున్నట్లు తేలిందని అధికారులు పేర్కొన్నారు. దురుద్దేశంతోనే అభ్యర్థులను ఈ ఆందోళనల వైపు మళ్లిస్తున్నారని ముఖ్యమంత్రికి వివరించారు.



**జీవో నెంబర్ 9 ప్రకారం ప్రైవేటు కోచింగ్ కేంద్రాలు పనిచేయాలి**

వాస్తవానికి, ఆంధ్రప్రదేశ్ కోచింగ్ సంస్థల నియంత్రణ నిబంధనలు 2026, జీవో నెంబర్ 9 ప్రకారం ప్రైవేటు కోచింగ్ కేంద్రాలు నిర్దేశిత మార్గదర్శకాలకు లోబడి పనిచేయాల్సి ఉంటుంది. అయితే, ఈ నిబంధనలను పక్కనపెట్టి కొన్ని సంస్థలు రాజకీయ కార్యకలాపాలు నడుపుతున్నాయని సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు.

**రాజకీయ కుట్రల్లోకి లాగాలని చూస్తే కఠిన పరిణామాలు**

ఈ నేపథ్యంలో, అభ్యర్థులను రాజకీయ కుట్రల్లోకి లాగాలని చూస్తే కఠిన పరిణామాలు తప్పవని ప్రభుత్వం హెచ్చరించింది. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే ఏ కోచింగ్ సెంటర్‌పైనా చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడంలో వెనుకాడేది లేదని స్పష్టం చేసింది

# పొదిలి మండలంలో సచివాలయాలను మార్కాపురం కలెక్టర్ 'ఆకస్మిక 'తనిఖీ'

-పెన్షన్ దరఖాస్తుల ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలి


-మార్కాపురం జిల్లా కలెక్టర్ ఎం.విజయ సునీత ఆదేశాలు

-అర్హులైన ప్రతి ఒక్కరికీ పెన్షన్ అందడమే ప్రభుత్వ లక్ష్యం

-రానున్న 48 గంటల్లో దరఖాస్తుల ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ పూర్తి కావాలన్న కలెక్టర్

-పొదిలి, కాటూరివారిపాలెం, తలమళ్ల సచివాలయాలను ఆకస్మిక తనిఖీ చేసిన కలెక్టర్



**మార్కాపురం, జిల్లా బ్యూరో, జర్నలిస్టు డైరీ :** అర్హులైన ప్రతి ఒక్కరికీ ఎన్టీఆర్ భరోసా పింఛన్ కానుక అందేలా దరఖాస్తుల పరిశీలన, ఆన్‌లైన్ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఎం. విజయ సునీత అధికారులను ఆదేశించారు. దరఖాస్తుల స్వీకరణకు ఈనెల 16వ తేదీ చివరి గడువు ఉన్న నేపథ్యంలో, మంగళవారం పొదిలి మండలంలో కలెక్టర్ ఆకస్మిక పర్యటన జరిపి క్షేత్రస్థాయి ప్రక్రియను పరిశీలించారు. ఈ పర్యటనలో భాగంగా పొదిలి ఎంపీడీవో కార్యాలయం,పొదిలి మున్సిపాలిటీ పరిధి లోని స్వర్ణ వార్డ్ – 5 సచివాలయం, కాటూరివారిపాలెం సచివాలయం, తలమళ్ల గ్రామ సచివాలయాలను కలెక్టర్ తనిఖీ చేశారు. ఆయా కేంద్రాల్లో ఇప్పటివరకు స్వీకరించిన దరఖాస్తులు, ఆన్‌లైన్‌లో నమోదు చేసిన వివరాలు, పెండింగ్‌లో ఉన్న ఫైళ్ల పురోగతిపై డీఎల్‌లు, పంచాయతీ కార్యదర్శులను అడిగి తెలుసుకున్నారు.

**గడువులోగా పూర్తి చేయాలి**

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ...రానున్న 48 గంటల్లో పెన్షన్ దరఖాస్తుల ప్రక్రియను వంద శాతం పూర్తి చేయాలని ఆదేశించారు.

**అర్హులకు అన్యాయం జరగొద్దు...**

అర్హులైన ఏ ఒక్క లబ్ధిదారుడూ సాంకేతిక లేదా ఇతర కారణాలతో పెన్షన్‌కు దూరం కాకుండా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని పేర్కొన్నారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ వెంటనే పెన్షన్ మంజూరయ్యేలా చర్యలు చేపట్టాలి ప్రతి దరఖాస్తును ప్రభుత్వ నిబంధనల మేరకు క్షుణ్ణంగా పరిశీలించి, అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ వెంటనే పెన్షన్ మంజూరయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పెండింగ్‌కు గల కారణాలను ఎప్పటికప్పుడు గుర్తించి తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ శివనారాయణ, ఎంపీడీవో శ్రీనివాసరావు, తహసీల్దార్ కృష్ణారెడ్డి, మున్సిపల్ కమిషనర్ రామ్మోహన్‌రావు మరియు ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఆళ్ల నాని ఆకస్మిక మృతి..
# నారా లోకేశ్ తీవ్ర దిగ్భ్రాంతి

-మాజీ ఉప ముఖ్యమంత్రి ఆళ్ల నాని గుండెపోటుతో హఠాన్మరణం

-ఆయన మృతి పట్ల నారా లోకేశ్ స్పందన

-వైఎస్ జగన్ కేబినెట్‌లో డిప్యూటీ సీఎంగా, వైద్య ఆరోగ్య శాఖ మంత్రిగా బాధ్యతలు

-కాంగ్రెస్, వైసీపీల తర్వాత ఇటీవలే టీడీపీలో చేరిన సీనియర్ నేత

-ఏలూరు నుంచి మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన బలమైన నాయకుడు



**ఏలూరు, అమరావతి, ఏపీ బ్యూరో, జర్నలిస్ట్ డైరీ :** ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో తీవ్ర విషాదం చోటు చేసుకుంది. రాష్ట్ర మాజీ ఉప ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ నేత ఆళ్ల నాని (56) మంగళవారం గుండెపోటుతో హఠాన్మరణం చెందారు. ఆయన ఆకస్మిక మరణ వార్తతో రాజకీయ వర్గాలు, ముఖ్యంగా టీడీపీ శ్రేణులు తీవ్ర దిగ్భ్రాంతికి లోనయ్యాయి.

**ఆళ్ల నాని మృతి పట్ల తీవ్ర దిగ్భ్రాంతి**

మంత్రి, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేశ్, ఆళ్ల నాని మృతి పట్ల తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. వివాదాలకు దూరంగా, అందరితోనూ స్నేహపూర్వకంగా మెలిగే నాని స్మృతిలో నివాళు లర్పిస్తున్నానని తెలిపారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నానని సోషల్ మీడియా ద్వారా పేర్కొన్నారు.

**మూడు పర్యాయాలు ఎమ్మెల్యేగా**


ఏలూరు నియోజకవర్గం నుంచి మూడు పర్యాయాలు ఎమ్మెల్యేగా గెలిచి, ప్రజలతో మమేకమైన నేతగా పేరుపొందిన ఆళ్ల నాని మరణం రాష్ట్ర రాజకీయాల్లో, ముఖ్యంగా ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో పూడ్చలేని లోటుగా భావిస్తున్నారు. ఆయన మృతి పట్ల పలువురు రాజకీయ ప్రముఖులు సంతాపం ప్రకటిస్తూ, ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నారు

## ఆళ్ల నాని మృతి పట్ల
# జగన్ తీవ్ర దిగ్భ్రాంతి

-గుండెపోటుతో హఠాన్మరణం చెందిన ఆళ్ల నాని

-నాని మరణవార్త తనను కలచి వేసిందన్న జగన్

-ఆళ్ల నాని మృతి తీరని లోటు అన్న బొత్స సత్యనారాయణ



**అమరావతి, ఏపీ బ్యూరో, జర్నలిస్ట్ డైరీ :** మాజీ ఉప ముఖ్యమంత్రి, ఏలూరు మాజీ ఎమ్మెల్యే ఆళ్ల నాని (56) అకస్మాత్తుగా గుండెపోటుతో కన్ను మూయడంపై వైసీపీ అధినేత జగన్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. విశాఖపట్నంలోని తన నివాసంలో ఆళ్ల నాని హఠాన్మరణం చెందారన్న వార్త తనను తీవ్రంగా కలచివేసిందని ఆయన తెలిపారు. నాని కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కష్టసమయంలో వారికి మనోధైర్యాన్ని ప్రసాదించాలని భగవంతుడిని ప్రార్థించారు. ఆళ్ల నాని ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు.

**శాసనమండలిలో ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ...**

ఆళ్ల నాని మరణవార్త విని తాను శోకసముద్రంలో మునిగిపోయానని, ఆయన మృతి తీరని లోటని ఆవేదన వ్యక్తం చేశారు. మాజీ మంత్రులు కన్నబాబు, వెల్లంపల్లి శ్రీనివాసరావు ఆళ్ల నాని కుటుంబ సభ్యులకు తమ సానుభూతిని ప్రకటిస్తూ ఆయన ఆత్మకు శాంతి కలగాలని కోరుకున్నారు. వైసీపీ విశాఖపట్నం జిల్లా అధ్యక్షుడు కేకే రాజు ఆళ్ల నాని భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

**ఆసుపత్రికి తరలించేలోపే ప్రాణాలు విడిచారు**

విశాఖపట్నంలో గుండెపోటుకు గురైన ఆళ్ల నానిని ఆసుపత్రికి తరలించేలోపే ప్రాణాలు విడిచారు. ఏలూరు నియోజకవర్గం నుంచి మూడుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికైన ఆయన, గత వైసీపీ ప్రభుత్వంలో ఉప ముఖ్యమంత్రిగా, వైద్యారోగ్య శాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వహించిన సంగతి తెలిసిందే

## కాంతి రాణా టాటా, విశాల్ గున్నిలపై సస్పెన్షన్ ఎత్తివేస్తూ జీవో జారీ చేసిన ప్రభుత్వం


-నటి కాదంబరి జెత్వానీ కేసులో నిబంధనలు ఉల్లంఘించారంటూ ఆరోపణలు

-2024 సెప్టెంబర్‌లో కాంతి రాణా, విశాల్ గున్నీలపై సస్పెన్షన్ వేటు

-తాజాగా జీవో విడుదల

-విధుల్లోకి తీసుకోవాలంటూ ప్రిన్సిపల్ సెక్రటరీ శ్యామల రావు పేరిట ఉత్తర్వులు





GOVERNMENT OF ANDHRA PRADESH
ABSTRACT
IPS – Sri Kanthi Rana Tata, IPS (RR:2004), IG and Sri Vishal Gunni, IPS, (RR:2010) DIG – Revocation of suspension – Reported to duty – Admitted to duty– Orders – Issued.

GENERAL ADMINISTRATION (SC.C) DEPARTMENT

G.O.RT.No. 1785 Dated: 15-09-2026
Read the following:-

1. G.O.Rt.No.1751, G.A. (SC.D) Department, dated 03.09.2026
2. G.O.Rt.No.1752, G.A. (SC.D) Department, dated 03.09.2026.
3. Joining Report, Dt.04.09.2026 of Sri Kanthi Rana Tata, IPS (RR:2004), IG.
4. Joining Report dated 05.09.2026 of Sri Vishal Gunni, Deputy Inspector General of Police. (RR:2010).

****

ORDER:

Consequent on revocation of suspension orders issued in the GOs in the first and second read above, and upon reporting for duty vide their joining reports third and fourth read above, the following Officers are admitted to duty, as mentioned below:

i) Sri Kanthi Rana Tata, IPS (RR:2004), IG, w.e.f. 04.09.2026 FN

ii) Sri Vishal Gunni, IPS (RR:2010), DIG, w.e.f. 05.09.2026 FN

2. The DGP(HoPF), AP shall take necessary action to submit the posting proposals to the above officers, to the Government, immediately

(BY ORDER AND IN THE NAME OF THE GOVERNOR OF ANDHRA PRAFESH)

J.Syamala Rao I.A.S
PRINCIPAL SECRETARY TO GOVERNMENT

To
The Member of Service concerned
(through the DGP(HoPF), AP, Mangalagiri).
The Director General of Police(HoPF), AP, Mangalagiri.
Copy to:
The Principal Secretary to Government, Home Department.
The Pay & Accounts Officer, Mangalagiri, Guntur District.
The Principal Accountant General (A&E), A.P., Vijayawada.
The Secretary Ministry of Home Affairs, Govt. of India, GoI, New Delhi.
The P.S. to C.S. / P.S. to Prl. Secy (Poll).
The General Administration (SC.D/SC.E/Accom) Dept. .
Sf/Sc.(3414879)

**అమరావతి, ఏపీ బ్యూరో, జర్నలిస్ట్ డైరీ :** ఆంధ్రప్రదేశ్ పోలీసు శాఖలో తీవ్ర అలజడి రేపిన నటి కాదంబరి జెత్వానీ కేసు వివాదంలో సస్పెన్షన్‌కు గురైన సీనియర్ ఐపీఎస్ అధికారులకు రాష్ట్ర ప్రభుత్వం కీలక ఉపశమనం అందించింది. సస్పెన్షన్‌లో ఉన్న ఐపీఎస్ అధికారులు కాంతి రాణా టాటా, విశాల్ గున్నీలపై ఉన్న సస్పెన్షన్‌ను తక్షణమే ఎత్తివేస్తూ ప్రభుత్వం ఈరోజు అధికారికంగా జీవోలు జారీ చేసింది. వీరిద్దరినీ వెంటనే విధుల్లోకి తీసుకోవాలంటూ ప్రిన్సిపల్ సెక్రటరీ శ్యామల రావు పేరిట ఉత్తర్వులు వెలువడ్డాయి.

**ముంబై నటి కాదంబరి జెత్వానీ కేసు నమోదు, విచారణ**


ముంబై నటి కాదంబరి జెత్వానీ కేసు నమోదు, విచారణ క్రమంలో నిబంధనల ఉల్లంఘనలు జరిగాయనే ఆరోపణలతో 2024 సెప్టెంబర్‌లో కాంతి రాణా టాటా, విశాల్ గున్నీలపై ప్రభుత్వం సస్పెన్షన్ వేటు వేసింది. సుదీర్ఘ కాలంగా కొనసాగుతున్న ఈ సస్పెన్షన్‌ను ఎత్తివేస్తూ తాజా జీవో జారీ కావడంతో ఇద్దరికీ పెద్ద ఊరట లభించినట్టయింది

## బాలాపూర్ గణనాథుడిని దర్శించుకున్న ఎమ్మెల్యే నవీన్ యాదవ్



**బడంగ్‌పేట్, సెప్టెంబర్ 15 జర్నలిస్ట్ డైరీ :** జీహెచ్‌ఎంసీ శంషాబాద్ జోన్ పరిధిలోని బడంగ్‌పేట్ సర్కిల్ బాలాపూర్ గ్రామంలో కొలువుదీరిన విఘ్నేశ్వరుడిని పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్, హైడ్రా కమిషనర్ రంగనాథ్, సీపీ సజ్జనార్ తదితరులు గణనాథుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారి తీర్థప్రసాదాలను స్వీకరించారు. ఉత్సవ కమిటీ సభ్యులు ప్రముఖులను శాలువాలతో సత్కరించి, బాలాపూర్ గణేష్ లడ్డూ ప్రసాదాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## భారీ వృక్షం నేల కూలడంతో తప్పిన పెను ప్రమాదం....!



**ఉమ్మడి వరంగల్, సెప్టెంబర్ 15 జర్నలిస్ట్ డైరీ :** వరంగల్ నగరంలోని హనుమకొండ పబ్లిక్ గార్డెన్ సమీపంలో భారీ వృక్షం ఒక్కసారిగా నేల కూలడముతో అక్కడే నిలిచి ఉన్న రెండు బైకులు, మూడు ఆటోలు తీవ్రంగా దెబ్బతినినుజ్జునుజ్జయ్యాయి. ఆ సమయంలో అటుగా వెళుతున్న బస్సులోని ప్రయాణికులు తీవ్రభయాందోళనకు గురైనారు. అదృష్టవశాత్తు ఎలాంటి ప్రాణస్టం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

## పాలిటెక్నిక్ విద్యార్థులు ఎంజీఎం కూడలిలో రాస్తారోకో




**ఉమ్మడి వరంగల్, సెప్టెంబర్ 15 జర్నలిస్ట్ డైరీ :** పాలిటెక్నిక్ విద్యార్థులు తమ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ వరంగల్ ఎంజీఎం కూడలిలో రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. విద్యార్థుల ఆందోళనలతో ఎంజీఎం ప్రధాన పరిసరాల్లో కొద్దిసేపు ట్రాఫిక్ అంతరాయము ఏర్పడింది. తమ సమస్యలు పరిష్కరించే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని విద్యార్థులు తెలిపారు. ఈ సమాచారం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని పరిస్థితిని పర్యవేక్షించారు.

Journalist dairy
బుధవారం
16-09-2026
జర్నలిస్ట్ డైరీ
తెలుగు దినపత్రిక



హాట్ లుక్స్ తో పిచ్చెక్కిస్తున్న ప్రణీత సుభాష్!


# బాక్సాఫీస్ వద్ద 'మండాడి' మేనియా..

**- 5 రోజుల్లో రూ.65 కోట్లు..**
**- ఓటీటీ డీల్‌తో నిర్మాతకు జాక్‌పాట్!**




తెలుగు, తమిళ భాషల్లో ఏకకాలంలో విడుదలైన స్పోర్ట్స్ యాక్షన్ డ్రామా 'మండాడి' బాక్సాఫీస్ వద్ద సరికొత్త రికార్డులు సృష్టిస్తోంది. సుహాస్, సూరి ప్రధాన పాత్రల్లో టాలెంటెడ్ డైరెక్టర్ మతిమారన్ పుగళేంది తెరకెక్కించిన ఈ చిత్రం, విడుదలై కేవలం ఐదు రోజుల్లోనే ప్రపంచవ్యాప్తంగా రూ.65 కోట్ల గ్రాస్ వసూళ్లను సాధించి ట్రేడ్ వర్గాలను విస్మయానికి గురిచేసింది. బోట్ రేసింగ్ నేపథ్యంతో సాగే వినూత్న కథాంశం, అద్భుతమైన యాక్షన్ ఘట్టాలు ప్రేక్షకులను థియేటర్లకు క్యూ కట్టేలా చేస్తున్నాయి.అయితే ఈ సినిమా కమర్షియల్ విజయంతో పాటు, దీని డిజిటల్ స్ట్రీమింగ్ రైట్స్‌కు సంబంధించిన న్యూస్ ఇప్పుడు హాట్ టాపిక్ గా మారింది. రూ.45 కోట్ల భారీ బడ్జెట్‌తో తెరకెక్కిన ఈ చిత్రానికి ప్రముఖ ఓటీటీ దిగ్గజం నెట్‌ఫ్లిక్స్ డిజిటల్ హక్కులను సొంతం చేసుకుంది. అయితే, ఈ డీల్ వెనుక ఒక ఆసక్తికరమైన బాక్సాఫీస్ లింక్ ఒప్పందం ఉన్నట్లు తెలుస్తోంది. మొదట నిర్మాత ఎల్రెడ్ కుమార్ రూ.25 కోట్లు డిమాండ్ చేయగా, నెట్‌ఫ్లిక్స్ రూ.15 కోట్లు మాత్రమే ఇవ్వడానికి ముందుకొచ్చింది. దీంతో ఇరువర్గాల మధ్య ఒక వినూత్న షరతుతో కూడిన ఒప్పందం కుదిరింది. సినిమా వసూళ్ల ఆధారంగా పారితోషికం పెరిగేలా ప్లాన్ చేశారు. బాక్సాఫీస్ వద్ద సినిమా రూ.50 కోట్లు దాటితే రూ.30 కోట్లు, అలాగే రూ.60 కోట్ల నుంచి రూ.80 కోట్ల మధ్య వసూలు చేస్తే ఏకంగా రూ.40 కోట్లు చెల్లించేలా ఒప్పందం కుదిరింది. ప్రస్తుతం ఈ చిత్రం ఐదు రోజుల్లోనే రూ.65 కోట్ల మార్క్‌ను అందుకోవడంతో, నెట్‌ఫ్లిక్స్ రూ.40 కోట్లు చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడింది. పెట్టిన బడ్జెట్‌లో సగానికి పైగా కేవలం ఓటీటీ హక్కుల ద్వారానే వెనక్కి వస్తుండటంతో నిర్మాతకు ఇది అసలు సిసలు జాక్‌పాట్ అని చెప్పవచ్చు. ఇదే జోరు కొనసాగితే 'మండాడి' త్వరలోనే వంద కోట్ల క్లబ్‌లో చేరడం ఖాయంగా కనిపిస్తోంది.

# ఆసక్తికరంగా జి.వి. ప్రకాష్ కుమార్ ఇమ్మోర్టెల్' తెలుగు ట్రైలర్





సంగీత దర్శకుడిగా, నటుడిగా టాలీవుడ్ మరియు కోలీవుడ్‌లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న జి.వి. ప్రకాష్ కుమార్ నటిస్తున్న తాజా చిత్రం 'ఇమ్మోర్టెల్' . తాజాగా ఈ సినిమాకు సంబంధించిన తెలుగు ట్రైలర్‌ను మేకర్స్ విడుదల చేశారు. మారీయప్పన్ చిన్న దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం ఇప్పటికే తమిళంలో విడుదలై ఘనవిజయం సాధించగా తాజాగా తెలుగులో సెప్టెంబర్ 19న విడుదల చేయబోతున్నారు. ఈ చిత్రంలో కాయదు లోహర్ హీరోయిన్‌గా నటిస్తోంది. ఈ సినిమాకు సామ్ సి.ఎస్ సంగీతం అందిస్తున్నారు.ఇక ఈ ట్రైలర్ చూస్తే.. ఆద్యంతం ఉత్కంఠభరితంగా సాగుతుంది. ప్రారంభంలో జి.వి. ప్రకాష్ కుమార్ మరియు కాయదు లోహర్ మధ్య లవ్ స్టోరీగా అనిపించినా, ఆ తర్వాత కథ పూర్తిగా ఒక రహస్యమైన మలుపు తిరుగుతుంది. ఈ చిత్రంలో కథాంశం మరణం లేని ఒక రహస్య వ్యక్తి చుట్టూ తిరుగుతున్నట్లు ట్రైలర్ చూస్తే అర్థమవుతుంది. సామ్ సి.ఎస్ అందించిన నేపథ్య సంగీతం మరియు విజువల్స్ ప్రేక్షకులను భయపెడుతూనే, సినిమాపై భారీ అంచనాలను పెంచుతున్నాయి.

# నిజమే అనుకుని ఏడ్చేదాన్ని..

ప్రస్తుతం బాలీవుడ్‌లో ఆలియాభట్ ప్రభ ఓ స్థాయిలో వెలుగుతున్నది. ఓ వైపు స్టార్‌డమ్‌ని, మరోవైపు కుటుంబ జీవితాన్ని ఆస్వాదిస్తూ ఆనందకరమైన జీవితాన్ని ఎంజాయ్ చేస్తున్నారామె. తాజాగా ఓ ప్రైవేట్ ఈవెంట్‌లో పాల్గొన్న ఆలియా.. 'కావాలని ఇతరులకు కోపం తెప్పించడం, లేదా చిరాకు పుట్టించడం' అనే అంశంపై మాట్లాడుతూ తన చిన్ననాటి జ్ఞాపకాలను పంచుకున్నారు. 'చిన్నతనంలో మా అక్క షాహీన్ నిరంతరం నన్ను కోపానికి గురిచేసేది.నాకింకా బాగా గుర్తు.. నాకు నాలుగేళ్లు ఉన్నప్పుడు 'నువ్వు అమ్మానాన్నలకు సొంత బిడ్డవు కావు. పార్లే-జి బిస్కెట్ ప్యాకెట్ కొంటే ఫ్రీగా నిన్ను ఇచ్చారు' అని చెప్పి ఏడిపించేది. ఆమె సరదాగా అంటున్న ఆ మాటలను నిజమే అనుకుని ఏడ్చేదాన్ని. ఇప్పుడు ఆ క్షణాలు గుర్తొస్తే నవ్వొస్తుంది. ఏదేమైనా ఇలాంటి చిలిపి గొడవలే అక్కాచెల్లెళ్ల బంధాలను బలోపేతం చేస్తాయని నా నమ్మకం' అని గుర్తు చేసుకున్నారు ఆలియా. ప్రస్తుతం 'డోంట్ బీ షైన్' అనే సినిమాను నిర్మిస్తున్న అలియా.. లవ్ అండ్ వార్, తుంబాడ్2 చిత్రాల్లో నటిస్తూ బిజీగా ఉన్నారు



# ఆకట్టుకుంటున్న 'అనుమాన పక్షి' ట్రైలర్!




యువతను విపరీతంగా ఆకట్టుకుని బాక్సాఫీస్ వద్ద సెన్సేషన్ సృష్టించిన 'డీజే టిల్లు' చిత్ర దర్శకుడు విమల్ కృష్ణ ఇప్పుడు మరో డిఫరెంట్ కాన్సెప్ట్‌తో ప్రేక్షకుల ముందుకు వస్తున్నారు. టాలెంటెడ్ హీరో రాగ్ మయూర్ ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం 'అనుమాన పక్షి' . తాజాగా విడుదలైన ఈ సినిమా ట్రైలర్ సినిమాపై అంచనాలను విపరీతంగా పెంచేసింది.ట్రైలర్‌ను గమనిస్తే.. హీరో పాత్రలోని 'అనుమానం' అనే బలహీనత చుట్టూ కథ ఎంతో ఆసక్తికరంగా, నవ్వులు తెప్పించేలా నడుస్తుందని స్పష్టమవుతోంది. ప్రతి చిన్న విషయానికి అనుమానపడే వ్యక్తిగా రాగ్ మయూర్ అద్భుతమైన హావభావాలతో కడుపుబ్బా నవ్విస్తున్నారు. కేవలం కామెడీ మాత్రమే కాకుండా ఇందులో మంచి క్రైమ్ థ్రిల్లర్ మరియు డార్క్ కామెడీ ఎలిమెంట్స్ కూడా జోడించినట్లు ట్రైలర్ ద్వారా తెలుస్తోంది. ఈ చిత్రంలో రాగ్ మయూర్ సరసన మెరిన్ ఫిలిప్ హీరోయిన్‌గా నటిస్తుండగా, ప్రిన్స్ సెసిల్, బ్రహ్మాజీ, అజయ్ వంటి ప్రముఖ నటులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. చిలకా ప్రొడక్షన్స్ సమర్పణలో రాజీవ్ ఈ సినిమాను నిర్మిస్తుండగా, శ్రీచరణ్ పాకాల అందించిన సంగీతం సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలవనుంది. వైవిధ్యమైన కథాకథనాలతో వస్తున్న ఈ 'అనుమాన పక్షి' సినిమా సెప్టెంబర్ 18న గ్రాండ్‌గా థియేటర్లలో విడుదలకు సిద్ధమవుతోంది. డీజే టిల్లు లాంటి మాస్ ఎంటర్‌టైనర్ తర్వాత విమల్ కృష్ణ ఈసారి ఎలాంటి వినోదాన్ని పంచబోతున్నారోనని సినీ ప్రియులు ఎంతగానో ఎదురుచూస్తున్నారు.

# అమెజాన్ ప్రైమ్‌లో దూసుకుపోతున్న 'హుషార్ పిట్టలు'..

**- ఓటీటీలోనూ అంచనాలకు మించి రెస్పాన్స్!**



సినిమా పరిశ్రమలో చిన్న చిత్రంగా విడుదలై, బాక్సాఫీస్ వద్ద భారీ ప్రభంజనం సృష్టించిన యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ 'హుషార్ పిట్టలు'. ఇప్పుడు ఈ సినిమా డిజిటల్ రంగంలోనూ అదే జోరును కొనసాగిస్తోంది. థియేటర్లలో ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకుని బ్లాక్‌బస్టర్ విజయాన్ని సొంతం చేసుకున్న ఈ చిత్రం, ప్రముఖ ఓటీటీ వేదిక అమెజాన్ ప్రైమ్ వీడియోలో అధికారికంగా స్ట్రీమింగ్ ప్రారంభించుకుంది. థియేటర్లలో ఈ సినిమాను చూడలేకపోయిన సినీ ప్రియులు, ప్రస్తుతం ఓటీటీలో చూసేందుకు అమితాసక్తి కనబరుస్తున్నారు.కేవలం యూత్‌ను మాత్రమే కాకుండా అన్ని వర్గాల ప్రేక్షకులను, కుటుంబాలను ఆకట్టుకునేలా అద్భుతమైన భావోద్వేగాలు, వినోదాత్మక అంశాలతో ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. అన్ను మరియు వాసవి గణేషన్ జంటగా నటించిన ఈ సినిమాలో ప్రతి ఒక్కరూ రిలేట్ చేసుకునేలా రియలిస్టిక్ సన్నివేశాలు ఉంటాయని చిత్ర యూనిట్ తెలిపింది. రుద్ర క్రాంతి పిక్చర్స్ పతాకంపై వెంకట్ యాదవ్ ఈ చిత్రాన్ని అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్మించగా, పద్మ అమ్మ మరియు బీవీజీ స్టూడియోస్ సహకారంతో ఇది ప్రేక్షకుల ముందుకు వచ్చింది. వినూత్న కథాకథనాలతో ఈ చిత్రానికి బిక్షు దర్శకత్వం వహించగా, సురేష్ ఏషియన్ ఫిలింస్ సంస్థ దీనిని థియేటర్లలో ఘనంగా విడుదల చేసింది. థియేటర్లలో ప్రేక్షకులే స్వయంగా ప్రచారకర్తలుగా మారి ఈ సినిమాను పెద్ద హిట్ చేశారని, ఇప్పుడు అమెజాన్ ప్రైమ్ ద్వారా ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఆడియన్స్‌కు ఈ చిత్రం మరింత చేరువవుతోందని చిత్ర నిర్మాత ఆశాభావం వ్యక్తం చేశారు. వీకెండ్‌లో మంచి టైమ్ పాస్ కోసం చూస్తున్న మూవీ లవర్స్‌కు 'హుషార్ పిట్టలు' ఒక చక్కటి ఎంపిక అని చెప్పవచ్చు.

Printed, Published and Owned by SITARALLA SRIRAMULU and Printed at M/s SRI DIVYA PRINTERS, Plot No. 33 & 34, 2nd Floor, Vasthu Colony, LB Nagar, Ranga Reddy, Telangana - 500074 and Published at H.No. 10-1-101/10. Bhagya Nagar Colony, Lingojiguda, Saroornagar, Ranga Reddy, Telangana - 500035. EDITOR: SITARALLA SRIRAMULU , RNI. No. TELTEL/2015/62524. Cell: 9966443465